


మహాశయులారా..! సోమవారం (నేడు) మీరు ఓటు వేయడానికి సిద్ధమవుతున్నారా...?! అయితే ఈవీఎంలో బటన్ నొక్కడానికి ముందు ఒక్కక్షణం ఆలోచించండి...! ఓటుకి నోటిచ్చారనే కృతజ్ఞతతోనూ, పక్కంటివారికి ఇచ్చి మాకు ఇవ్వలేదనే కోపంతోనే మీ ఓటును దుర్వినియోగం చేసుకోవద్దు.. ఎవరు ఇచ్చినా.. ఎంత ఇచ్చినా... తీసుకోండి.. ! భద్రంగా దాచుకోండి... కాని ఓటుకు మాత్రం నోటుతో ముడిపెట్టకండి. గత ఐదేళ్ల పాలనను గుర్తుకు తెచ్చుకోండి. అప్పుడే నొక్కండి..ఈవీఎం బటన్...!

ఒక్క క్షణం..!

- ఈవీఎం బటన్ నొక్కేముందు ఆలోచించండి!
- తట్టెడు ఇసుక దొరక్కపడ్డ తంటాలు చూడండి..
- కొల్లగొట్టిన సిలికా, క్వార్ట్జ్‌ను పరికించండి
- పోలీసుల దౌర్జన్యాలను వీక్షించాం..
- కావలి వేధింపు ఘటనలు కళ్లారా చూశాం..
- ఆకాశాన్నంటిన నిత్యావసరాలు..
- గుదిబండగా మారిన గ్యాస్, కరెంట్ బిల్లులను భరించాం కదా ?
- పెట్రోలు, డీజిల్ భారాలు కూడా మోశాం కదా ?
- చివరకు దిక్కులేనివారిలా రాజధాని లేని రాష్ట్రంలో బతుకులు ఈడ్చాం..
- ఈ కష్టాలకు కారకులెవరో...?

ఇప్పుడు నొక్కండి.. గట్టిగా ఈవీఎం బటన్ !



నెల్లూరు, మే12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలసీ పేరుతో మూడు నెలలపాటు ఇసుక అనుమతులను రద్దు చేశారు. దీంతో మనింటి పక్కనున్న భవన నిర్మాణ కార్మికులకు పనిలేకుండా పస్తులు ఉండేలా చేశారు. ఇసుక పాలసీ పేరుతో భవన నిర్మాణ యజమానులపై వేలాది రూపాయల భారాన్ని మోపారు. అధికార వైసీపీ నాయకులు మాత్రం దర్జాగా ఇసుకను కొల్లగొట్టుకుపోయారు. సిలికా, క్వార్ట్జ్ లీజుదారులను తరిమికొట్టి, వైసీపీ పెద్దలు వాటిని కొల్లగొట్టిన వైనాన్ని చూశాం. ఇంటి పక్కనున్న గుట్టలో నుంచి కానీ, ఊరి మొగదాల ఉన్న చెరువులో బండెడు మట్టి కానీ తోలుకోలేని దౌర్భాగ్యపు పాలకులు రాజ్యమేలడం కూడా మీరే చూశారు.

● ఈ సన్నివేశాల్ని గుర్తు చేసుకోండి..

పోలీసులు రాజ్యమేలిన భయానక పరిస్థితులు చూశారు. వైసీపీ పెద్దమనుషులు చేతులకు లాఠీలు అప్పగించి, చోద్యం చూసిన పోలీసు అధికారులను చూశారు. పోలీసుల వేధింపులు తట్టుకోలేక పొదలకూరులో శవమై చెట్టుకు వేళాడిన ఉదయగిరి నారాయణ విషాదగాథ మీకు గుర్తుండే ఉంటుంది. మర్రిపాడులో విషం తాగి చనిపోయిన తిరుపతయ్య కథ కూడా మీకు తెలుసు. అధికార పార్టీ నాయకుల వేధింపులు తట్టుకోలేక కావలికి చెందిన కరుణాకర్ ఇంట్లో శవమై వేలాడిన సంఘటన చూశాం. అదే ఊర్లో బాడుగ తోలుకుని బతకడానికి వీలులేదని చేసిన వేధింపులకు నిరసనగా, కావలి ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట పురుగుల మందు తాగి మృత్యువు ముంగిట వరకు వెళ్లిన అభాగ్యుడి దీన గాథ కూడా విన్నాం. రాజకీయ కక్షతో పొలం గట్లు కలిపేసుకున్న ఘటనలు... ఇంటి ప్రహరీలు పడగొట్టిన సంఘటనలు... తప్పుడు కేసులు పెట్టిన ఉదంతాలు కూడా కో కొల్లలుగా చూశాం.

● ఇక్కట్లన్నీ అనుభవించాం..

పెరిగిన నిత్యావసరాల ధరలతో పచ్చడి మెతుకులు తిన్న రోజులు... కన్నీళ్లు తెప్పించిన కరెంటు బిల్లులు.. గుదిబండగా మారిన గ్యాస్ ధరలు... పొరుగు రాష్ట్రాల కన్నా పెట్రోలు, డీజిల్ ధరలు లీటరుపై 10 రూపాయల అదనంగా చెల్లించాల్సిన పరిస్థితులు... అన్నీ కూడా గుర్తుండే ఉంటాయి. వీటన్నింటిని ఒకసారి మననం చేసుకుని ఓటెవరికి వేయాలో... ఆలోచించి నిర్ణయం తీసుకోండి. ?

● తెలుగుతల్లిని చూసి..

ప్రతి ఒక్కరూ కుటుంబానికి ప్రాధాన్యమిస్తారు. ఆ తరువాత ఊరంటే ఇష్టపడతారు. ఈ రెండింటి తరువాత దేశమంటే గౌరవిస్తారు. యుద్ధంలోనే కాదు, క్రీడల్లో కూడా మన దేశంపై పొరుగుదేశం విజయం సాధించడానికి ఏ ఒక్కరూ అంగీకరించరు. మరి మన రాష్ట్రం అంటే గౌరవం లేదా...? ఐదేళ్లుగా రాజధానికి దూరంగా నిలువ నీడ లేక కన్నీరుమున్నీరవుతున్న తెలుగుతల్లిని చూసి ఓటెవరికి వేయాలో.. నిర్ణయించుకోండి. రాజధాని కోసం భూములు త్యాగం చేసిన అమరావతి రైతుల ఆక్రందనలు గుర్తుకు తెచ్చుకొని ఓటేవరికి వేయాలో... నిర్ణయించుకోండి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయిన యువత కన్నుల చెలమల్లోంచి పాయలు కడుతున్న కన్నీటి ప్రవాహానికి కారకులెవరో గుర్తించి ఓటేయండి...? అప్పులపాలైన రాష్ట్రాన్ని, రాజధాని లేని రాష్ట్రాన్ని, అశాంతి, అభద్రత నిండిన రాష్ట్రాన్ని ఎవరు ఉద్ధరించగలరో...? ఎవరు గట్టెకించగలరో.. రాష్ట్రంలో ఎవరు శాంతిని స్థాపించగలరో... ఎవరు ఏ భయం లేని స్వేచ్ఛాపూరిత వాతావరణాన్ని సృష్టించగలరో.. ఎవరు సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లుగా చూసి రాష్ట్రాన్ని ఉద్ధరించగలరో...బాగా ఆలోచించి ఓటేయండి.!



నెల్లూరు : మూలాపేటలోని వేదసంస్కృత పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది



పోలింగ్‌కు మేం సిద్ధం..



ఆత్మకూరులో పోలింగ్ సామగ్రితో సిబ్బంది



కల్యాణ మండపంలా..

మామిడితోరణాలు, అరటి పిలకలు, పూలహారాలతో కల్యాణమండపంలా ఉన్న ఈ పోలింగ్ కేంద్రం ఇందుకూరుపేట మండలం జగదేవిపేటలోనిది.



ఓటరు తీర్పు నేడే!

- పోలింగ్‌కు సర్వం సిద్ధం
- ఎన్నికల బరిలో 129 మంది అభ్యర్థులు
- 2,470 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- ఉదయం 7 నుంచి ప్రారంభం
- సాయంత్రం 6 వరకు క్యూలో ఉన్నోళ్లకు అవకాశం

నెల్లూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడెప్పుడా అని ప్రజలు ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కుతో సమర్థవంతమైన పాలకులను ఎన్నుకునేందుకు ఓటర్లు సిద్ధమయ్యారు. సార్వత్రిక ఎన్నికలు-2024 పోలింగ్ సోమవారం జరగనుంది. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు ఒకేసారి పోలింగ్ జరుగుతోంది. జిల్లాలో ఒక పార్లమెంటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఏజెంట్ల సమక్షంలో పోలింగ్ సిబ్బంది మాక్ పోలింగ్‌ను నిర్వహించిన అనంతరం మెయిన్ పోలింగ్‌ను ప్రారంభిస్తారు. వేసవి నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఈ దఫా సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్‌కు అవకాశం కల్పించింది. ఆరు గంటల వరకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. నెల్లూరు పార్లమెంటుతోపాటు 8 అసెంబ్లీ నియోజకవర్గాల బరిలో 129 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. నెల్లూరు ఎంపీ స్థానానికి 14 మంది, కందుకూరు అసెంబ్లీ స్థానానికి 22 మంది, కావలికి 13, ఆత్మకూరుకు 13, కోవూరుకు 13, సర్వేపల్లికి 13, నెల్లూరు సిటీకి 15, నెల్లూరు రూరల్‌కు 13, ఉదయగిరికి 15 మంది పోటీ చేస్తున్నారు. అయితే పోటీ మాత్రం ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ మధ్యనే జరుగుతోంది.

● పటిష్ట ఏర్పాట్లు

పోలింగ్ నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఎన్నికల పరిశీలకులు నిశితంగా పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో 2,470 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, అత్యధికంగా కోవూరులో 324, ఉదయగిరిలో 323, కావలిలో 314 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక జిల్లాలో 20,61,822 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 10,08,792 మంది, స్త్రీలు 10,52,819 మంది, ఇతరులు 211 మంది ఓటర్లుగా ఉన్నారు. 432 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా అధికారులు గుర్తించారు. అక్కడ కేంద్ర బలగాలను మోహరించారు. ఎటువంటి చిన్న అవాంఛనీయ ఘటనకు పాల్పడినా తీవ్ర చర్యలు తప్పవని ఇప్పటికే ఎస్పీ హెచ్చరించడం గమనార్హం.

● కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

ప్రత్యక్షంగా పోలింగ్ విధుల్లో 14,687 మంది సిబ్బంది పాల్గొంటున్నారు. వీరంతా ఆదివారం సాయంత్రమే వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. నియోజకవర్గానికి ఒకచోట రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయాన్నే పోలింగ్ సిబ్బంది ఆ సెంటర్లకు చేరుకున్నారు. వారికి అప్పటికప్పుడు ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలను కేటాయించి ఈవీఎం, వీవీప్యాట్, సిరాతో పాటు ఇతర పోలింగ్ సామగ్రిని అందజేశారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెం టనే ఎన్నికల అధికారు లు ఏర్పాటు చేసిన బస్సుల్లో నిర్దేశించిన రూట్లలో పోలింగ్ కేంద్రాలకు బయల్దేరారు. ఆదివారం సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలన్నీ పోలింగ్ సిబ్బంది చేతు ల్లోకి చేరాయి. కాగా మరో 2,823 మంది సిబ్బందిని రిజర్వు లో ఉంచారు. పోలింగ్ సమయంలో అవసరమైతే వీరి సేవలను వినియోగించుకుంటారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ అన్ని కేంద్రాలను పరిశీలించి ప్రక్రియను పర్యవేక్షించారు.



అంతా బాగుందా!? కోవూరులో ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

● తరలివస్తున్న యువత

ఓటు వేసేందుకు యువత ఆసక్తి చూపుతోంది. జిల్లాలో ఉన్న వారే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు, చదువుకుంటున్న వారు భారీగా తరలివస్తున్నారు. శనివారం, ఆదివారాల్లో చాలా మంది స్వగ్రామాలకు చేరుకున్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో వీరి సందడి కనిపిస్తోంది.. వీరే కాకుండా ఓటు హక్కు కలిగిన వారంతా తమ స్వగ్రామాలకు పయనమవుతున్నారు. వీరి రాకతో ఆదివారం బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి. గతానికి భిన్నంగా ఓటు తమ బాధ్యత అని యువత భావిస్తోంది. 2014 ఎన్నికల్లో జిల్లాలో 74 శాతం పోలింగ్ నమోదవగా 2019లో 76 శాతం నమోదైంది. అయితే నేడు జరగనున్న ఎన్నికల్లో ఈ శాతం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
కందుకూరు	113224	115729	26	228979
కావలి	117152	121465	28	238645
ఆత్మకూరు	105873	109579	8	215460
కోవూరు	129004	138374	25	267403
నెల్లూరు సిటీ	116764	122713	67	239544
నెల్లూరు రూరల్	136691	144237	20	280948
సర్వేపల్లి	112812	119196	26	22034
ఉదయగిరి	120108	121743	10	241861
వెంకటగిరి	57164	59783	1	116948
(3 మండలాలు)				
మొత్తం	1008792	1052819	211	2061822

పోలింగ్ కేంద్రాలు, అభ్యర్థుల వివరాలు...

నియోజకవర్గం	కేంద్రాలు	సమస్యాత్మకం	అభ్యర్థులు
కందుకూరు	271	55	22
కావలి	314	91	13
ఆత్మకూరు	278	66	13
కోవూరు	324	55	13
నెల్లూరు సిటీ	248	36	15
నెల్లూరు రూరల్	285	36	13
సర్వేపల్లి	284	55	13
ఉదయగిరి	323	43	15
మొత్తం	2470	437	115
నెల్లూరు (ఎంపీ)			14



నెల్లూరులో ఎన్నికల సామగ్రితో సిబ్బంది

మిగిలింది ఓటేంగే !

● ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలిన అధికారులు, సిబ్బంది

● బారికేడ్లు, షామియానాలతోపాటు అన్ని ఏర్పాట్లు పూర్తి

ఆత్మకూరు, మే 12 : సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆత్మకూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధులత తెలిపారు. ఆదివారం ఈ విషయంపై ఆమె మాట్లాడారు. పోలింగ్‌కు సంబంధించి 278 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,15,519 మంది ఉండగా వారిలో పురుషులు 1,05,873, మహిళలు 1,09, 579, ఇతరులు 67 మంది ఉన్నారన్నారు. శాంతి భద్రతలు, ఎన్నికల నిబంధనల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. 66 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో భద్రతా దృష్ట్యా ముగ్గురు పోలీసులు, ఒకరు హెడ్ కానిస్టేబుల్ పోలింగ్ కేంద్రం వద్ద ఉంటారన్నారు. అన్ని ప్రాంతాల కేంద్రాలను పరిశీలించేందుకు అన్నిరూట్లలో ప్రత్యేకరూట్ మొబైల్ అధికారులు పర్యటిస్తారని చెప్పారు. అన్నిపోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు పూర్తి చేశామన్నారు. ఎన్నికల సమయంలో కవ్వింపు చర్యలు, ఉద్రిక్త పరిస్థితులకు లోనుకాకుండా వ్యవహరించాలని నాయకులు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గానికి సంబంధించి ఆంధ్ర ఇంజనీరింగ్ కాలేజిలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ పరిశీలించి సూచనలిచ్చారు.

సంగం: సార్వత్రిక ఎన్నికలకు మండలంలో 47 పోలింగ్ కేంద్రాల్లో పురుషులు, స్త్రీలకు క్యూ లైన్లను వేర్వేరుగా ఏర్పాటు చేశారు. వేసవి కావడంతో ఓటు వేసేందుకు వచ్చిన వారికి క్యూలైన్లల్లో వేసి ఉన్నప్పుడు ఎండ తగలకుండా షామియానాలు ఏర్పాటు చేశారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, దివ్యాంగులకు ట్రై సైకిళ్ల సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఈవో రమాదేవి పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు సోమవారం సాయంత్రానికి పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రితో చేరుకున్నారు. రెవెన్యూ సిబ్బంది పోలింగ్ కేంద్రాల్లో కావల్సిన ఏర్పాట్లతో పాటు వారికి భోజనం, రాత్రికి వసతి ఏర్పాటు చేశారు. పోలింగ్‌కు సర్వం సిద్ధంగా ఉంచారు.

అనంతసాగరం: మండంలోని 44పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓటర్లు ఇబ్బందులు పడకుండా పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీటి వసతి, షామియానాలు ఏర్పాటు చేసి ఇతర వసతలు కల్పించారు. కేంద్రాలకు సిబ్బంది చేరుకొన్నారు.

ఉదయగిరి: నియోజకవర్గంలో 2,41,677 ఓటర్లు ఉన్నారు. అందులో 1,19,929 మంది పురుషులు, 1,21,738 మంది మహిళలు, పది మంది ఇతరులు ఉన్నారు. పోలింగ్ నిర్వహణకు 323 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 232 పోలింగ్ కేంద్రాల్లో 42 సెక్టార్లను 162 వెబ్ క్యాస్టింగ్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. 43సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పీవోలు 323 మంది, ఏపీవోలు 323 మందిని నియమించారు. 1,292 మంది ఓపీవోలను, 329 బ్యాలెట్ యూనిట్లు, 323 కంట్రోల్ యూనిట్లు ఏర్పాటు చేశారు. ఉదయగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పోలింగ్ విధులు నిర్వహించే అధికారులకు ఎన్నికల సామగ్రిని అందజేశారు. వారు సామగ్రిని పరిశీలించుకున్నారు. మధ్యాహ్నం భోజనం అనంతరం బస్సుల్లో మూడు గంటలకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. స్ట్రాంగ్‌రూమ్ నుంచి ఎన్నికల సామగ్రిని శిబిరం వద్దకు తరలించే కార్యక్రమాన్ని, ఎన్నికల అధికారులు, ఎన్నికల సామగ్రిని చూసే జనరల్ అబ్జర్వర్ రామ్‌కుమార్ గౌతమ్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజా రమేష్‌ప్రేమ్‌కుమార్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి నెహ్రూబాబులు పరిశీలించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో అధికారులకు వసతి, భోజనం, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతులను కల్పించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉదయగిరి రూరల్: పోలింగ్ కేంద్రాలకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయడంతో బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇతరప్రాంతాల్లో ఉండే వలసవాసులు ఉదయగిరి బస్టాండ్‌కు చేరుకున్నారు. అయితే వారి గ్రామాలకు చేరుకొనేందుకు బస్సులు లేకపోవడంతో గంటల తరబడి బస్టాండ్ సెంటర్‌లో వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. కొందరు ప్రయాణికులు ప్రైవేటు వాహనాలకు అధిక నగదు చెల్లించి గ్రామాలకు చేరుకున్నారు. ఎన్నికల దృష్ట్యా వాహన రాకపోకలు అధికం కావడంతో పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.



ఉదయగిరి ఉన్నత పాఠశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కి సామగ్రి కోసం వచ్చిన అధికారులు, సిబ్బంది



ఆత్మకూరు : ఎన్నికల ఏర్పాట్లును పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్



సంగం: ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు, షామియానా



సంగం: పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తుకు వచ్చిన కేంద్ర బలగాలు

విచ్చలవిడిగా మద్యం విక్రయాలు

అనంతసాగరం, మే 12: గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. సోమశిల, అనంతసాగరం, చిలకలమర్రి, రేవూరులో ప్రభుత్వ షాపులున్నాయి. కోడ్ అమల్లో వైన్‌షాపులు మూసేశారు. బయట జోరుగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. రూ.130 మద్యం సీసాపై మరో రూ.150 అదనంకు అమ్ముతున్న పరిస్థితి కనిపిస్తుంది. అధిక ధరలకు మద్యం అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పోటా పోటీగా డబ్బు పంపిణీ

కలిగిరి, మే 12: మండలంలో ప్రధాన పార్టీలకు చెందిన ఇరువర్గాలు శుక్ర, శనివారాల్లో పోటాపోటీగా డబ్బు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ఒక పార్టీ వారు వెయ్యి వంతున పంపిణీ చేయడంతో మరోపార్టీ రూ.1500 పంపిణీ చేసినట్లు సమాచారం. ఓటర్లు ఇరుపార్టీల వద్ద డబ్బు తీసుకున్నారు. దీంతో ఒక ఓటు ఓ పార్టీకి చెందిన ఎమ్మెల్యేకి, మరొక ఓటు ఇంకో పార్టీకి చెందిన ఎంపీకి వేసి తీసుకున్న డబ్బుకు న్యాయం చేస్తామని సదరు ఓటరు చెబుతుండడం విశేషం. దీంతో క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశం ఎక్కువగా కనిపిస్తుందని నాయకులు అంటున్నారు.

మద్యం దొరక్క అవస్థ

మద్యం అందుబాటులో లేకపోవడంతో మండలంలోని మందుబాబులు అవస్థలు పడుతున్నారు. ప్రధాన పార్టీ నాయకులు మందు అందివ్వలేమని చేతులెత్తేసరికి మందు ఎక్కడ దొరుకుతుందా అని ఆరా తీస్తున్నారు. బ్రాండు మద్యం తాగే మద్యం ప్రియులు కూడా ఈ రెండు రోజులు కనీసం జగన్ బ్రాండ్ దొరికినా చాలని పేర్కొంటున్నారు.

రూ.500 నోట్ల హల్‌చల్



ఉదయగిరి రూరల్, మే 12: ఓటరు ప్రలోబాల పర్వం జోరుగా సాగుతోంది. శనివారం సాయంత్రం ఆరు గంటలకు ప్రచారం ముగిసినప్పటి నుంచి ఆదివారం అర్ధరాత్రి వరకు ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీల నాయకులు ప్రలోబాలకు తెరదీశారు. ఒక్క ఓటుకు రూ.1,500ల నుంచి రూ.2,000ల వరకు పంపిణీ చేశారు. ఎక్కడ చూసినా రూ.500నోటు కనిపిస్తున్నాయి. ఎన్నికల వేళ కోట్లు నేతలు ఖర్చు చేస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు తమదైన రీతిలో అధికారం దక్కించుకోవాలని ఎవరికి వారు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నిబంధనలకు మించి ఖర్చు చేయకూడదనే ఆంక్షలు ఉన్నా ఈ ఖర్చులు రికార్డులకే పరిమితమవుతాయన్న వాస్తవం జగమెరిగిన సత్యమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈ ఎన్నికల్లో డబ్బు పంపిణీ ప్రభావం మరీ ఎక్కువగా కనిపిస్తోంది. అయితే ఓటరు నాడి చిక్కక నేతలు తలలు పట్టుకుంటున్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

కావలి రూరల్, మే 12: ప్రతి ఒక్కరు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ పేర్కొన్నారు. పట్టణంలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంను, జడ్పీ స్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికల పకడ్బందీగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై డీఎస్పీ వెంకటరమణ, సిబ్బందితో చర్చించామన్నారు. ఓటింగ్ జరిగేటప్పుడు సామాన్యులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలన్నదే ప్రధాన ఉద్దేశం అన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అనేక మందిని కూడా బైండోవర్ చేసుకున్నామన్నారు. నియోజక వర్గాల వారీగా సమస్యాత్మక గ్రామాలను గుర్తించి వెబ్ కెమెరాలు ఏర్పాటుతో పాటు పోలింగ్ కేంద్రాల వద్ద వీడియో గ్రఫీ, కేంద్ర బలగాల ఏర్పాటుతో పాటు ప్రత్యేక అబ్జర్వర్లను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సూరజ్, డీఎస్పీ వెంకటరమణ, 1వ పట్టణ, రెండవ పట్టణ, రూరల్ సీఐలు రాజేష్, కొండవీటి శ్రీనివాసరావు, కాటూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉదయగిరి : అన్ని నియోజకవర్గాల్లో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్ తెలిపారు.

● సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

● ఉదయగిరి, కావలి పోలింగ్ కేంద్రాల పరిశీలనలో ఎస్పీ

ఆదివారం ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ఎన్నికల ఈవీఎంల తరలింపు కార్యక్రమాన్ని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బస్సుల్లో పోలింగ్ సామగ్రితో పాటు అధికారులను పోలీసుల సహకారంతో కేంద్రాలకు తరలిస్తున్నట్లు చెప్పారు. భద్రతలకు ఉదయగిరి అసెంబ్లీ పరిధిలో డీఎస్పీతో పాటు ఆరు మంది సీఐలు, పది మంది ఎస్ఐలు, 400 మంది సిబ్బందిని నియమించామన్నారు.



ఉదయగిరి: ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

ఓటు వేశాక..వలసలే గతి!



అడుగంటిన వెంకట్రావుపల్లి చెరువు

● మెట్ట ప్రాంతాల ప్రజల ఆందోళన!

● ఉపాధి లేక ఊళ్లు వదిలి వెళ్లేందుకు సిద్ధం అవుతున్న నిరుపేదలు

● హామీలకే పరిమితమైన పాలకులు

ఉదయగిరి రూరల్: ప్రకృతి కనికరించక.. పాలకులు ఉపాధి కల్పించక పోవడంతో నిరుపేద, మధ్యతరగతి ప్రజలు తల్లడిల్లుతున్నారు. తిన డానికి తిండిలేక ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి వలస వెళుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఇంటికి కాపలాగా వృద్ధులు, చిన్నారులను వదిలి వెళుతున్నారు. అయినవాళ్లు ఎప్పుడు తిరిగివస్తారని. అమ్మానాన్నలకు దూరంగా ఉంటున్న చిన్నారులకు ఇంటి దగ్గర ఉండే పెద్దలను అడుగుతున్నారు. మా ఒంటరితనం తీరేదెన్నడని.. నెర్రలిచ్చిన పొలాలు బోరుమంటున్నాయి.. తడేసేది ఎప్పుడని మెట్టప్రాంతాల్లోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో దశాబ్దాలుగా పొట్టచేత పట్టుకొని వలసలు సాగుతున్నా వాటిని నివారించేందుకు ప్రతిసారీ పాలకులు చేస్తున్న హామీలు నీటి మూటలకే పరిమితమయ్యాయి. ఉదయగిరి నియోజకవర్గంలో ఎలాంటి ఉపాధి లేకపోవడంతో 40శాతం మంది ప్రజలు ప్రతిఏడాది వలసబాట పడుతున్నారు. ప్రధానంగా సీతారామపురం, వరి కుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి, కొండాపురం, కలిగిరి మండలాల్లో ఈ వలసలు అధికం. వీరు ఎక్కువగా బెంగుళూరు, మహారాష్ట్ర, గోవా, పూణే, చెన్నై, తెలంగాణ, విజయవాడ తదితర పట్టణ ప్రాంతాలకు వలసవెళ్లారు. ఈ ఎన్నికలు ఉండటంతో కొన్నిగ్రామాల ప్రజలు తిరిగి గ్రామాలకు వచ్చారు. ఓటు వేసి తిరిగి వలస వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. ఎన్నికలకు ముందు ప్రతిసారి పోటీలో నిలిచే అభ్యర్థులు సాగు, తాగు నీటి కష్టాలు తీరుస్తాం.. వలస నివారణకు పరిశ్రమలు స్థాపిస్తామని ఊక దంపుడు ఉపన్యాసాలు ఇస్తారే తప్ప కార్యరూపం దాల్చిన దాఖలాల్లేవు. ప్రధానంగా పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్, సోమశిల హైలెవల్ కెనాల్ పనులు దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాంత కష్టాలు తీరేటట్లు లేవని వాపోతున్నారు. తమ తలరాతలు ఎప్పుడు మారుతాయానని మెట్ట ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్నారు.



వలస వెళ్లడంతో తాళం వేసి ఉన్న ఇల్లు

ఉపాధి లేక వలస..



వరుణుడు కరుణించకపోవడంతో పొలాలు బీళ్లుగా మారాయి. దీని కితోడు గ్రామంలో ఎలాంటి ఉపాధి లేక తన నలుగురు పిల్లలు ఏలూరులో వ్యాపారం, ఇతరత్రా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పండుగలు, శుభకార్యాలకు గ్రామాలకు వచ్చి పోతుంటారు.

- పువ్వాడి రమణమ్మ, వడ్లమూడిపల్లి

ఒంటరిగా ఉన్నా..



నాకు ముగ్గురు పిల్లలు. స్థానికంగా ఉపాధి లేక పొట్టచేత పట్టుకొని హైదరాబాదు, విజయ వాడ, మహారాష్ట్రలో పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నా. తాను మాత్రమే గ్రామంలో ఉంటున్నా. అధికారులు స్పందించి గ్రామాల్లో ఏమైనా ఉపాధి పనులు కల్పిస్తే బాగుంటాది.

-రాయవరపు లక్ష్మమ్మ, వడ్లమూడిపల్లి

కందుకూరులో సానుకూల పవనాలు

● ఇంటూరికి వివిధ సామాజికవర్గాల మద్దతు

కందుకూరు, మే 12: నియోజకవర్గంలో చాలాకాలం తర్వాత టీడీపీకి సానుకూల పవనాలు వీస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకతకుతోడు అనూహ్యంగా వచ్చిన రాజకీయ మార్పులు ఆ పార్టీకి కలిసొచ్చాయి. గత రెండేళ్లుగా టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పలు ప్రజాసమస్యలపై పోరాటం చేస్తున్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలను అడ్డుకోవడం, ఇసుక అక్రమ తవ్వకాలను నిలిపివేయించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. మరోవైపు నియోజకవర్గంలో అనాదిగా కాంగ్రెస్‌కు, వైసీపీకి ఓటుబ్యాంకుగా ఉన్న కొన్ని సామాజికవర్గాలు టీడీపీకి మద్దతు పలికాయి. మరోవైపు గ్రామగ్రామాన నేతలు వైసీపీని వీడి టీడీపీలోకి క్యూ కట్టారు. కందుకూరులో ఐదు దశాబ్దాలపాటు చక్రంతిప్పిన దివి కుటుంబం, మానుగుంట కుటుంబం నుంచి ఈసారి బరిలో ఎవరూ లేరు. ఈ అంశం కూడా టీడీపీ కలిసొచ్చింది. దీనికితోడు నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి తనసేవాకార్యక్రమాల ద్వారా వైసీపీ క్యాడర్‌ను టీడీపీలోకి తీసుకురాగలిగారు. వీటన్నింటికీ తోడు సిటింగ్ ఎమ్మెల్యే మహీధరరెడ్డిని కాదని, ఈప్రాంతంతో అనుబంధం లేని బుర్రా మధుసూదన్‌ను వైసీపీ అభ్యర్థిగా ప్రకటించటం టీడీపీకి అనుకూలమైంది. జగన్ ప్రభుత్వంపై ఉద్యోగవర్గానికి ఉన్న వ్యతిరేకతకు తోడు పట్టణంలో వైసీపీకి గట్టి ఓటుబ్యాంకుగా ఉన్న బ్రాహ్మణ, కాపు, వైశ్య సామాజికవర్గాల వారు ఈసారి టీడీపీకి మద్దతు పలుకుతున్నారు. అలాగే బుర్రాకు స్థానిక నాయకుల పనితీరుపై కనీస అవగాహన లేదు. దీనికితోడు పోల్ మేనేజ్‌మెంట్ ఆయనకు పెద్ద మైనస్‌గా మారిందని విశ్లేషకుల అంచనా. గత 50 రోజులుగా టీడీపీ నేతలు పట్టణంలో విస్తృతంగా ఇంటింటి ప్రచారం చేస్తుండగా, వైసీపీ ప్రచారంలో బాగా వెనుకపడింది. వైసీపీకి బలంగా భావిస్తున్న గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లో పెత్తనంచేసే బీసీ సామాజికవర్గంపై ఎస్సీలు, ఎస్టీలు, మత్స్యకారులు, ఇతర అన్నికులాల్లోనూ తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఆ వ్యతిరేకతే తమకు ఓట్లు రాలుస్తుందని టీడీపీ నేతలు అంచనా వేస్తున్నారు. మొత్తంమీద టీడీపీ శ్రేణులు విజయంపై ధీమాగా ఉన్నాయి.

గంజాయి మత్తులో యువకుల హల్‌చల్

● బేకరి యజమానిపై కర్రతో దాడి ● అదుపులోకి తీసుకున్న పోలీసులు



కనిగిరిరోడ్డులో ఓ బేకరి వద్ద గుమిగూడిన జనం

కందుకూరు, మే 12: పట్టణంలోని కనిగిరిరోడ్డులో ఉన్న డిలీట్షియా బేకరి వద్ద ఆదివారం గంజాయి మత్తులో కొందరు యువకులు హల్‌చల్ చేశారు. మత్తులో ఏమి చేస్తున్నారో వారికే అర్థంకాని రీతిలో ప్రవర్తించటమే గాక లిఫ్ట్ పని చేయలేదని బేకరి యజమానిని బూతులు తిట్టి తలపై కర్రతో కొట్టి గందరగోళం సృష్టించారు. పట్టపగలే గంజాయి మత్తులో యువకులు నానా బీభత్సం సృష్టించి బేకరి సిబ్బందిపైనా, యజమానిపైనా దాడి చేశారు. దాడి చేసిన వారిలో కొందరు యువకులు పట్టణంలోని ఉప్పుచెరువు ప్రాంతానికి చెందినవారు కాగా మరికొందరు బయటి ప్రాంతాలవారు, ఇతర రాష్ట్రాల యువకులు ఉన్నట్లు సమాచారం. యువకులు కర్రలు, కత్తులు, ఇతర మారణాయుధాలతో వచ్చి పట్టపగలు బీభత్సం సృష్టించటం పట్ల ప్రజల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమయ్యాయి. గతంలో ఈ బ్యాచ్ పట్టణంలోని సూర్య బార్ అండ్ రెస్టారెంట్ వద్ద కూడా ఇదే తరహాలో బీభత్సం సృష్టించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కొందరు యువకులను అదుపులోకి తీసుకోగా మరికొందరు పరారయ్యారు.

అంకమ్మకు ఇంటూరి ప్రత్యేక పూజలు



అంకమ్మ ఆలయంలో ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, మే 12: ఎన్నికల ప్రచారం పూర్తయి ఓట్ల యుద్ధానికి సమయం దగ్గరపడ్డ నేపథ్యంలో కందుకూరు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం గ్రామదేవత అంకమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధుబాబు కోరిక మేరకు ఎన్నికల్లో అంతా శుభమే జరగాలని, ఘనవిజయం వరించేలా ఆశీర్వదించాలని అమ్మవారిని కోరుకుంటూ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, జీ.శ్రీనులతో పాటు టీడీపీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసాద్, చుండూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ ఆలయానికి విరాళం

కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ పునర్నిర్మాణం కోసం పట్టణంలోని గుర్రంవారిపాలెంకు చెందిన గుడిపూడి సురేష్‌బాబు, రజిత దంపతులు రూ.25వేలు విరాళం అందజేశారు. ఆదివారం వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు, గాండ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

వలేటివారిపాలెం, మే 12 : మండలంలోని కళవళ్లలో ఓ యువకుడు ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నారు. వివరాల మేరకు కళవళ్లకు చెందిన తానికొండ హేమంత్ (23) తల్లిదండ్రులు ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటుండగా హేమంత్ స్వగ్రామంలోనే ఉంటున్నాడు. ఏమైందో ఏమో తెలియదు కానీ హేమంత్ ఇంటి స్లాబుకు ఫ్యాన్‌ల కోసం ఏర్పాటు చేసి ఇనుప చువ్వకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు చుట్టు పక్కల వాళ్లు చూసి హేమంత్‌ను కిందకు దించేసరికి అప్పటికే మృతి చెందాడు. సమాచారం తెలుసుకొన్న ఎస్‌ఐ బాలమహేంద్రనాయక్ సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

● పకడ్బందీగా నిర్వహించండి ● ఎన్నికల పరిశీలకుడు గౌతమ్

● సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది



కందుకూరు : అధికారులకు సూచనలు ఇస్తున్న సబ్‌కలెక్టర్ విద్యాధరి



కావలిటౌన్ : సామగ్రిని పరిశీలించుకుంటున్న ఎన్నికల సిబ్బంది

కావలిటౌన్, మే 12: కావలి నియోజకవర్గంలో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఆదివారం పట్టణంలోని విశ్వోదయ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు సిబ్బందికి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు సూచనలు చేశారు. అనంతరం ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లు, తదితర ఎన్నికల సామగ్రిని సిబ్బందికి పంపిణీ చేశారు. నియోజకవర్గం పరిధిలో 114 పోలింగ్ బూత్‌లు, బూత్‌కు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక ఉప ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు సిబ్బంది, పోలీసులు, వెబ్ కెమెరా సిబ్బందిని నియమించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్నికల పరిశీలకుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని, ఎక్కడా ఎలాంటి పొరపాట్లు, ఆరోపణలకు తావులేకుండా సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూడాలని పేర్కొన్నారు. అనంతరం అధికారులు, సిబ్బంది ఎన్నికల సామగ్రితో ఆయా ప్రాంతాల పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకుడు, నుడా వీసీ బాపిరెడ్డి, ఆర్డీవో శీనానాయక్, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : పోలింగ్ సామగ్రితో బయల్దేరిన పీవోలు



లింగసముద్రం జడ్పీ హైస్కూల్లో వేసిన టెంట్లు



కావలిటౌన్ : ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు



అల్లూరు : సిద్ధం చేసిన పోలింగ్ బూత్



కలిగిరి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన బారికేడ్లు

పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది ఉండేందుకు పోలింగ్ కేంద్రాలలోనే అన్ని ఏర్పాట్లు చేసినందున ఆయా గ్రామాలలో నాయకుల ఇళ్లవద్ద బస చేయటం, వారు పంపించిన ఆహారం తీసుకోవటం లాంటి పొరపాట్లు చేయవద్దని, అలా ఎవరైనా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడ ఏ చిన్న సమస్య వచ్చినా తక్షణం నా దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. కార్యక్రమంలో డీఏవో రవికుమార్ పాల్గొన్నారు.

అల్లూరు: మండలంలో మొత్తం 57 పోలింగ్ కేంద్రాల్లో 44,872 మంది తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని షామియానాలు, తాగునీరు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఎన్నికల అధికారి దుర్గేశ్వరరావు మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.

కలిగిరి: మండలంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో రంగసుబ్బరాయుడు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించామన్నారు. ఓటరు స్లిప్‌లు అందని వారికి పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అందించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. సోమవారం ఉదయ 7 నుంచి సాయంత్రం 6 గం టల వరకు ప్రజలు తమ ఓటు హ క్కు వినియోగించుకోవాలని కోరారు.

లింగసముద్రం : మండలంలో ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసీల్దారు జీ.శ్రీచరణ్ తెలిపారు. మండలంలోని 30,953 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. వీరు తమ ఓటు హక్కు వినియోగించుకొనేందుకు 38 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించండి

కందుకూరు : కందుకూరు ని యోజకవర్గంలోని 271 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు పో లింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కందుకూరు సబ్ కలెక్టరు జి.విద్యాధరి కోరారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలల ప్రాంగణంలో ఆదివారం ఆమె పీవోలు, ఏపీవో లు, ఇతర పోలింగ్ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలింగ్ కేంద్రాలలో వ్యవహరించాల్సిన తీరుపై అవగాహన కల్పించి ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామగ్రిని

అంగన్‌వాడీ వర్కర్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

కావలి టౌన్ : ఎన్నికల విధులకు హాజరయ్యేందుకు వచ్చి రైలు ప్రమాదంలో మృతి చెందిన అంగన్‌వాడీ వర్కర్ సుభాషిణి కుటుంబానికి ఎక్స్‌గ్రేషి యా చెల్లించాలని అంగన్వాడీ వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుజాతమ్మ, రెహెనా బేగంలు డిమాండ్ చేశారు. రాపూరు అంగన్వాడీ ప్రాజెక్ట్‌కు చెందిన బట్టా సుభాషిణి తన కుమారుడు విజయ్‌కుమార్‌ను తోడు తీసుకుని గూ డూరు నుంచి రైలులో కావలి చేరుకుని పట్టాలు దాటే క్రమంలో తల్లీ కుమారుడు అక్కడికక్కడే మృతి చెందడం బాధకరమన్నారు. మృతులు ఒక్కొక్కరికీ రూ.50లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి అంగన్వాడీ ఉద్యోగం ఇవ్వాలన్నారు.

ఆంధ్రజ్యోతి జన కేతనం
సోమవారం 13 మే 2024

ఓటేసేటప్పుడు ఇవి గమనించండి!



- వేలిపై ఇంకుముద్ర వేశాక ఈవీఎం ఆన్ అవుతుంది.
- ఈవీఎం ఆన్‌చేయగానే బీప్ అనే శబ్దం వస్తుంది.
- మిషన్ దగ్గర ఆకుపచ్చ లైట్ వెలుగుతుంది.
- అప్పుడే మిషన్‌పై గుర్తు నొక్కాలి.
- అప్పుడు కూడా బీప్ శబ్దం వస్తుంది.
- వీపాట్‌లో అభ్యర్థి ఫొటోను, గుర్తు పక్కాగా గుర్తించాలి
- బటన్ నొక్కగానే ప్రింట్ అయి కింద ఉన్న బాక్స్‌లో పడుతుంది.
- హడావిడిలో ఇవన్నీ మనం ఈ విషయాలను గమనించం. అధికారులను కూడా అడగం, మిషన్ నొక్కేసి అంతా బాగుందని వెళ్లిపోతాం..
- ఒకవేళ అనుమానం వచ్చి అధికారులను అడిగినా ఏదో సర్ది చెబుతారు.
- ఇవన్నీ గమనించకపోతే మన ఓటు నమోదు కాకుండా పోయే అవకాశం కూడా ఉంది.

- నెల్లూరు (సాంస్కృతికం)

ఓటర్ స్లిప్పులు ఎగ్గొట్టి..
నగదు నొక్కేసి !

చోటామోటా నేతలతో బీఎల్వోల లాలూచీ

కావలి, మే12: అక్రమార్జనకు అవకాశం ఉన్నంతవరకు కొంత మంది దేన్నీ కూడా వదలరు. ఇందుకు ఉదాహరణ ఇదిగో... సార్వత్రిక ఎన్నికలకు ఓటర్లకు నగదు పంచే విషయంలో కొందరు బీఎల్వోలు, వివిధ పార్టీల చోటామోటానేతలతో లాలూచీ పడి ఓటర్ల డబ్బులను కొట్టేశారు. బీఎల్వోలు అందచేసిన స్లిప్పులు చూపిస్తేనే ఓటర్లకు కావలిలో డబ్బులు పంపిణీ చేశారు. బీఎల్వోలు ప్రతివార్డుకు 100 మంది వరకు స్థానికంగా లేనివారు, డబుల్ ఎంట్రీ ఉన్నవారి స్లిప్పులు వారి వద్దనే ఉంచుకున్నారు. అలాంటి వారు ఫోన్ చేస్తే పోలింగ్‌బూత్ వద్దకు వచ్చినపుడు అక్కడ ఇస్తానని చెబుతున్నారు. డబుల్‌ఎంట్రీ స్లిప్పులను ఇళ్లకు ఇవ్వగా, బీఎల్వో వద్ద ఉన్న స్లిప్పులను తీసుకుని కొందరు డబ్బులు పంచేవద్దకు వెళ్లారు. అయితే వాటికి డబ్బులు ఇచ్చినట్లు వారు నోట్ చేసుకుని ఉండటంతో ఈ స్లిప్పులకు డబ్బులు ఇచ్చామే... మళ్లీ ఎలా వచ్చాయని ఆశ్చర్యపోతున్నారు. మరికొందరు బీఎల్వోలు వార్డు ఇన్‌చార్జిలకే నేరుగా స్లిప్పులు ఇవ్వడంతో వారిలో కూడా కొందరు పంపిణీ డబ్బులను నొక్కారనే ప్రచారం ఉంది.

కల్లుకు గిరాకీ


మద్యం దుకాణాల మూతతో డిమాండ్



ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ మద్యం దుకాణాలకు తాళాలు పడ్డాయి. దీంతో కల్లు దుకాణదారులు తమ వ్యాపారాన్ని జోరుగా కొనసాగించారు. మండలంలోని గువ్వాడి, తూర్పుబోయమడగల, జీ.కొండారెడ్డిపల్లి, ఇస్కపల్లి, జడదేవి, వరికుంట పాడు, మహమ్మదాపురం, తూర్పురొంపిదొడ్ల, పెద్దిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో కల్లు విక్రమాలు బాగా సాగాయి. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు కొనసాగాయి. అదే అదునుగా భావించిన వ్యాపారులు నాసిరకం కల్లు విక్రయిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఎన్నికల వేళ కల్లు అమ్మకాలను కూడా నియంత్రించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- వరికుంటపాడు

ఈ బండితో వేట సాధ్యమేనా!?



కావలి రూరల్ : అసలే ఎన్నికలు.. ఏ క్షణాన్నైనా ఏమైనా జరగొచ్చు. అంత పకడ్బందీగా ఉండాలి. కానీ, ఈ పోలీస్ జీపును చూశారా!? ఎన్నికల విధులకు వచ్చి కావలి పోలీస్ పరేడ్ మైదానంలో ఇలా ఆగిపోయింది. ఇంకేముంది. పరుగు తీసేందుకు మొండికేసిన ఈ జీపును అక్కడే ఉన్న కొంతమంది ఇలా నెట్టుతూ కనిపించారు!?. ఈ దృశ్యం ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

సజావుగా పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు

- నిరంతరాయంగా పరిశీలన
- వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలనలో కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), మే 12 : నేటి(సోమవారం) ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్‌ను సజావుగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేశామని కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. ఎన్నికల సామగ్రిని పంపిణీ చేసే డిస్ట్రిబూషన్ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజవర్గాల పరిధిలోని 2,470 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.

● నిరంతరాయంగా పరిశీలన

పోలింగ్ ప్రక్రియను నెల్లూరులోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా నిరంతరాయంగా పరిశీలించేందుకు అన్నీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు ఆయన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. సీ విజిల్, 1950 కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు అన్నీ బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిస్టికల్ సర్వైయల్ టీములు నిరంతరం నిఘా ఉంచి తనిఖీలు చేపట్టాలన్నారు. సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలను కూడా పరిశీలించాలన్నారు. రాజకీయ ప్రకటనలు ప్రసారం కాకుండా చూడాలన్నారు. ఎక్కడైనా ప్రసారమై తే వెంటనే చర్యలకు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్‌బూత్‌ల్లో పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.



కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించిన అనంతరం మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

● ఆ ప్రచారాన్ని నమ్మవద్దు..

జిల్లాలో చెరగని సిరా ద్వారా ఓటర్ల వేలిపై వారి ఇంటి వద్దే మార్కుచేస్తూ ఓటు హక్కును వినియోగించుకోకుండా చూడాలనే కుట్ర జరుగుతున్నదంటూ సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. చెరగని సిరాను ప్రభుత్వం మాత్రమే తయారు చేస్తుందని, ఈ సిరా భారత ఎన్నికల సంఘం వద్ద మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు : ఎస్పీ

నెల్లూరు(క్రైం) : శాంతి భద్రతలు పరిరక్షిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని జిల్లా ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ పోలీసు అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఎస్పీ సుడిగాలి పర్యటన చేపట్టారు. పలు నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆత్మకూరులోని ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాల, ఉదయగిరిలోని ఇంటిగ్రేటెడ్ బీసీ హాస్టల్ గ్రౌండ్, కావలి, కందుకూరు పరిధిలోని ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను, నెల్లూరు డీకేడబ్ల్యూ కళాశాల, వెంకటాచలంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి, చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు సూచనలిచ్చామ న్నారు. బారికేడ్ల ఏర్పాట్లు, ఓటర్ల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్, తదితర ఏర్పాట్లపై సూచనలు చేశామన్నారు. ప్రజలు తమ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగిం చుకోవడమేలక్ష్యంగా ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. బందోబస్తు నిర్వహణ తీరును సీసీ టీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ఏ చిన్న సమస్య తెలెత్తినా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించామన్నారు. పోలింగ్ బూత్‌ల దగ్గర ఓటర్లు, ప్రజలు గుంపులు గుంపులుగా ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌కు సీఆర్‌పీఎఫ్ బలగాలను కేటాయించామని చెప్పారు.



వలసవాసులు వచ్చేశారు!

కావలి/ఉదయగిరి రూరల్ : ఓట్లు వేసేందుకు వలసవాసులు ఆదివారం సొంతూళ్లకు చేరడంతో మెట్టప్రాంతంలోని పల్లెలు, పట్టణాల్లో సందడి వాతా వరణం నెలకొంది. ఉదయగిరి నియోజకవర్గంలో 2,41,677 ఓట్లు ఉండగా, 40 శాతం మంది ఓటర్లు పొట్టచేత పట్టుకుని ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ప్రధానంగా సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, కొండాపురం, కలిగిరి మండలాలకు చెందిన వారు బెంగుళూరు, హైదరాబాదు, చెన్నై, గోవా, పూణె, విజయవాడ తదితర ప్రాంతాలకు వలస వెళ్లారు. వీరంతా రావడంతో ఆదివారం ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్ కిటకిటలాడింది. ఇక కావలి నియోజకవర్గంలో సుమారు 20వేల మంది ఇతర ప్రాంతాల్లో ఉంటున్నట్లు సమాచారం. వీరంతా బస్సులు, రైళ్లు, సొంత వాహనాల్లో స్వగ్రామాలకు చేరుకున్నారు. వీరందరికీ ఆయా పార్టీల నాయకులు నాయ కులు ప్రయా ణ, భోజనం, ఇతర ఖర్చులు భరించడంతోపాటు ఓటుకు ఇంతమొత్తం ఇస్తామని చెప్పి పిలిపించినట్లు సమాచారం. కొందరు నాయకులు ఏకంగా ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేశారు.

'గిరి'లో ఉక్కపోత

అల్లాడిపోయిన సిబ్బంది, సొమ్మసిల్లిన కానిస్టేబుల్



ఉదయగిరి రూరల్ : ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం ఈవీఎంల పంపిణీ కేంద్రం వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర అవస్థలు పడ్డారు. మండుటెండలో నీడ కోసం షామియానాలు ఏర్పాటు చేసినా పూర్తిస్థాయిలో ఫ్యాన్లు లేకపోవడంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఓ వైపు కారుతున్న చెమట, మరోవైపు ఎన్నికల సామగ్రి సరి చూసుకోలేక ఉద్యోగుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఏ ఉద్యోగి చేతిలో చూసినా పేపర్, అట్టముక్క, కర్చీఫ్ పట్టుకుని గాలి విసురుకుంటూ కనిపించారు. మరోవైపు తాగునీరు క్యాన్లలో ఏర్పాటు చేయడంతో దాహం తీర్చుకొనేందుకు వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. వాష్‌రూమ్స్, మరుగుదొడ్లు కూడా సక్రమంగా లేవు. ఉక్కపోతను తట్టుకోలేక ఓ కానిస్టేబుల్ సొమ్మసిల్లి పడిపోయాడు.

ఓటర్లకు ప్రయాణ కష్టాలు

- హక్కు వినియోగానికి వచ్చి బస్సుల కోసం పడిగాపులు
- ఆర్టీసీ గ్రామీణ సర్వీసులు రద్దు
- గంటల తరబడి బస్టాండ్లలో నిరీక్షణ
- ప్రమాదకరంగా ఆటోల్లో ప్రయాణం
- సంగంకు చార్జీ రూ.300, ఆత్మకూరు రూ.500
- అధికారుల తీరుపై ఆగ్రహం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట). మే 12: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చిన ప్రజలు ఆదివారం ఆర్టీసీ బస్టాండ్లలో బస్సులు లేక అష్ట కష్టాలు పడ్డారు. పనులు మానుకొని, ఎంతో ఖర్చు పెట్టుకుని కుటుంబంతోసహా రైళ్ల, ప్రైవేటు ట్రావెల్స్, ఆర్టీసీ బస్సుల్లో నెల్లూరుకి చేరుకున్నారు. ఇక్కడి నుంచి వారివారి స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్సులు లేక ఆర్టీసీ ప్రధాన బస్టాండు, ఆత్మకూరు బస్టాండ్లలో వేలాదిమంది ఉండిపోయారు. దీంతో ఆర్టీసీ సిబ్బందిని వారు ప్రశ్నించడంతో బస్సులన్నీ ఎన్నికల విధులకు వెళ్లాయని, గ్రామీణ సర్వీసులను పూర్తిగా రద్దు చేశామని చెప్పారు. దీంతో చేసేది లేక పలువురు అధిక చార్జీలు చెల్లించి ఆటోల్లో వెళ్లారు.

● అధికారుల తీరుపై ఆగ్రహం

తమ ప్రాంతాలకు బస్సులు లేవని తెలియడంతో జిల్లా అధికారులపై ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎన్నికలు జరుగుతుండటంతో ఆదివారమే ఓటర్లు వస్తారని అధికారులకు తెలియదా ? అని వారు ప్రశ్నించారు. ఎన్నికల విధులకు ఆర్టీసీ బస్సులను పంపినప్పుడు ప్రత్యమ్నాయ రవాణా ఏర్పాట్లు చేయా లని అధికారులకు తెలియదా ? అని ప్రశ్నించారు. ఆర్టీసీ బస్టాండ్లు ఖాళీగా మారడంతో నేరుగా ఆటోలు ఆయా ప్లాట్‌ఫారమ్‌ల వద్ద వచ్చి ప్రయాణికులను ఎక్కించుకున్నారు. నెల్లూరు నుంచి సంగంకు ఆటో చార్జి రూ.300, ఆత్మకూరుకు రూ.500, ఇలా దూరాన్ని బట్టి రూ.100నుంచి రూ.800 వసూలు చేశారు. ఒక్కొక్క ఆటోలో 15 నుంచి 25 మందిని ఎక్కించుకుని ప్రమాదకరంగా ప్రయాణించారు. ఇక ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు రంగంలోకి దిగి, చెన్నై, తిరుపతి, ఒంగోలు ప్రాంతాల వైపు అధిక చార్జీలు వసూలు చేస్తూ తిరిగాయి.



ఆత్మకూరు బస్టాండులో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు



బస్సులు లేక ఆటోల్లో ప్రయాణిస్తున్న ప్రజలు

నిర్మాణ రంగాన్ని
కూల్చేసిన జగన్

వేలాదిమంది జీవితాలు అతలాకుతలం
కార్మికుల పొట్టగొట్టిన వైసీపీ సర్కార్





నెల్లూరు (సాంస్కృతికం) మే 12 : జగన్ సీఎం పీఠం ఎక్కగానే భవన నిర్మాణ రంగాన్ని దారుణంగా దెబ్బతీశారు. ఉచిత ఇసుక విధానం ఎత్తివేసి, దోపిడీకి శ్రీకారం చుట్టారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అరకోటికిపైగా, జిల్లాలో లక్షన్నరకుపైగా కార్మికుల జీవితాలు అతలాకుత లం అయ్యాయి.

● కార్మిక సంక్షేమం గాలికి..

1996లో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేశారు. నిర్మాణ రంగం నుంచి ఒక శాతం సెస్సు వసూలు చేసి, ఆ నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వినియోగించేవారు. 2019 నాటికి దాదాపు రూ. ఆరువేలకోట్లపైగా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ నిధులు ఉంటే, వాటిని జగన్ ప్రభుత్వం దారి మళ్లించింది.ఈ 58 నెలల కాలంలో ఒక్క రూపాయి కూడా లేకుండా చేసింది.జిల్లాలో ఒకటిన్నర లక్షలకుపైగా భవన నిర్మాణ కార్మికులుంటే అందులో 60వేల మందికి పైగా కార్మికశాఖలో నమోదై ఉన్నారు. 1996 నుంచి 2018 వరకు కార్మిక సంక్షేమ నిధులను భవన నిర్మాణ కార్మికులు అందుకున్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు రూ.50 సభ్యత్వం, సంవత్సర చందా రూ.12 చొప్పున ఐదేళ్లకు రూ.60లు మొత్తం రూ.110 చెల్లించి పేరు నమోదు చేసుకుని గుర్తింపు కార్డు పొందాలి. కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షలు, ప్రమాదంలో 25 శాతం అంగవైకల్యానికి రూ.25వేలు, 46 శాతం వైకల్యానికి రూ.50 వేలు, 50 నుంచి 75 శాతం వైకల్యానికి రూ.లక్ష, శాశ్వత వైకల్యానికి రూ.5లక్షలు ఇస్తారు. సహజ మరణానికి రూ.60వేలతోపాటు అంత్యక్రియలకు (మట్టి ఖర్చులు) సాయం పొందేవారు. భవన నిర్మాణ కార్మికుడి కుటుంబంలో కుమార్తె వివాహానికి ఖర్చులు, రెండు కాన్పులకు ప్రసూతిసాయం రూ.20వేలు లభించేవి. తాత్కాలిక వైకల్యం, అనారోగ్యానికి గురైన కార్మికుడికి రోజుకు రూ.2వేలు, గరిష్ఠంగా రూ.3వేలు అందచేసేవారు. ఈ సాయం 2019 సంవత్సరానికి ముందు వరకు లభించింది. 2019 నాటికి ఆర్థిక సాయం కోసం కార్మిక శాఖకు చేసుకున్న దరఖాస్తులు దాదాపు 2వేలకు పైగా ఉన్నాయి. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక సంక్షేమ నిధులకు మంగళం పాడింది. కార్మికుడు చనిపోతే కనీసం మట్టి ఖర్చులు (అంత్యక్రియలు) కూడా పైసా ఇవ్వని పరిస్థితి నెలకొంది.దీంతో భవన నిర్మాణ కార్మికులు రోడ్లెక్కి నిరసనలు, ధర్నాలు చేశారు. అయినా సీఎం జగన్ మనసు కరగలేదు. ఈ 58నెలల జగన్ ప్రభుత్వ పాలనలో భవన నిర్మాణ కార్మికులు, పనులు లేక, సంక్షేమ పథకాలు అందక అల్లాడిపోయారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో వసూలు చేసిన సెస్సు రూ.14,57, 45,650. కానీ వారి కోసం ఖర్చు చేసింది రూపాయి కూడా లేదు. ఈ విధంగా వైసీపీ ప్రభుత్వం కార్మికుల కడుపులు కొట్టింది.



మోసం గురూ!

సంగం, మే 12 : గ్రామీణ ప్రాంతాల్లో సులభంగా, వేగంగా ఎల్లవేళలా ప్రజలకు సేవలు అందచేసే మీ సేవ కేంద్రాలు జగనన్న రాకతో మూతపడ్డాయి. వాటికి సమాంతరంగా సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వాటిల్లో సేవలు అందచేసేందుకు ప్రభుత్వ ఉద్యోగులను నియమించినా మీ సేవ కేంద్రాల్లో మాదిరిగానే ప్రతి సర్వీసుకు రుసుం వసూలు చేస్తున్నారు. రెండింట్లో ఒకే రుసుం వసూలు చేయడం, సచివాలయాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5-00 గంటల వరకే పని చేస్తుండడంతో ప్రజలు మీ సేవ కేంద్రాలపట్లే మొగ్గు చూపేవారు. అంతేకాక మీ సేవ కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉండడంతో వాటికి ఆదరణ తగ్గలేదు. ఈ క్రమంలో సచివాలయాల పట్ల ప్రజలు మొగ్గు చూపడం లేదని, క్రమేణా మీ సేవ కేంద్రాల్లో సర్వీసులను తొలగిస్తూ వచ్చారు. దీంతో వాటి నిర్వాహణ భారమై మూత పడ్డాయి. ఫలితంగానిర్వాహకులు వీధిన పడ్డారు.

250కి పైగా కేంద్రాలు

జిల్లాలో 2012లో మీసేవ కేంద్రాల పేరుతో ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ప్రతి మండలంలో రెండు కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇవి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుండడంతో కేంద్రాల సంఖ్యను పెంచింది. దీంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 250 కేంద్రాలకుపైగా ఏర్పాటయ్యాయి. ఈ కేంద్రాల్లో సుమారు 542 రకాల సర్వీసులను ప్రభుత్వ నిర్దేశించిన రుసుంతో అందచేసేవారు. ప్రతి పనికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగకుండా సులభంగా, వేగంగా పనులు జరిగేవి.

సమాంతరంగా సచివాలయ వ్యవస్థ ● మీ సేవ కేంద్రాలపైనే ప్రజల మక్కువ
వాటి నుంచి ప్రభుత్వ సర్వీసుల తొలగింపు ● సెంటర్ల మూత, వీధినపడ్డ నిర్వాహకులు

జగనొచ్చాడు..
మీ సేవలకు రాం రాం !

సచివాలయాలతో తిప్పలు

సచివాలయంలో కూడా మీసేవ కేంద్రాల్లో అందే 542 సర్వీసులను అందచేస్తామన్నారు. అయితే అక్కడుండే సిబ్బంది ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకే అందుబాటు ఉంటున్నారు. ప్రజలు ఆ సమయంలోనే వెళ్లాలి. ఒకవేళ వెళ్లినా వారు ఇతర ప్రభుత్వ పనుల్లో బిజీబిజీగా ఉండేవారు. ఒక్కొక్కసారి ఆన్‌లైన్ పనిచేయలేదనో.. ఇతర కారణాలతో ప్రజలకు పనులు చేసేవారు కాదు. అదే మీ సేవ కేంద్రాల వారు ఎల్ల వేళలా అందుబాటులో ఉంటారు. ఆర్వోఆర్-1బీ, అడంగల్ వంటి పత్రాలు ఫోన్ చేసి వచ్చేలోపు ఇస్తుండడంతో సౌలభ్యంగా ఉండేది. కానీ సచివాలయాల్లో అలా జరగడంలేదు.

కేంద్రాల మూత

ప్రభుత్వ సర్వీసులన్నీ మీ సేవ కేంద్రాల్లో తొలగించడంతో కేవలం ప్రైవేట్ సర్వీస్‌లపైనే మీ సేవ ఆపరేటర్లు ఆధారపడవలసి వచ్చింది. దీంతో అవి జరక్క క్రమేణా మూతపడ్డాయి. దీంతో పట్టణాల్లో తప్ప మండలాలు, గ్రామాల్లో చూద్దామన్నా మచ్చుకైనా కనిపించడం లేదు. దీంతో నిరుద్యోగులు ఉపాధి కోల్పోయారు.



సంగంలో మూతపడిన మీ సేవ కేంద్రం

బతుకు దెరువు కోల్పోయాం



సచివాలయాల ఏర్పాటుతో మీసేవ కేంద్రాలకు ప్రభుత్వ సర్వీసులు నిలిపివేయడం దారుణం. సర్వీసులన్నీ ఉంచితే ప్రజలకు మెరుగైన సేవలు అందేవి. కానీ గత ప్రభుత్వంలో ఏర్పాటైన మీసేవ కేంద్రాలు ఉండ కూడదనే ఉద్దేశంతో మీ సేవ కేంద్రాలపై కక్షి కట్టి సర్వీసులను తొలగించింది. దీంతో మా బతుకు దెరువు పోయింది.

- జీ. గిరీష్, మీసేవ నిర్వాహకుడు, సంగం

కోవూరు
సర్వేపల్లి



వెంకటాచలం: అధికా రులకు, సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ఎన్నికల అధి కారి హరినారాయణన్



మనుబోలు: ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

● ఎన్నికల సిబ్బందికి కలెక్టర్ హరినారాయణన్ సూచన ● నేడు జరిగే పోలింగ్‌కు సర్వం సిద్ధం

వెంకటాచలం, మే 12: ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ సిబ్బందికి సూచించారు. స్థానిక క్యూబా ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందికి, అధికారులకు తగు సలహాలు, సూచనలు అందజేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా ఉండేందుకు 500 మంది భద్రతా సిబ్బందిని నియమించారు. 2150 మందిని ఎన్నికల విధులకు కేటాయించారు. సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలకు ఎన్నికల సామాగ్రిని ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాహనాల్లో పోలీసుల భద్రతతో తరలించుకువెళ్లారు. నియోజకవర్గంలో 55 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అదనపు బందోబస్తును ఏర్పాటుచేశారు. నియోజకవర్గం అంతటా 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. సోమవారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

ఓటు హక్కు వినియోగించుకోవాలి : ఆర్వో

క్యూబా ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఎన్నికల విధులకు హాజరయ్యే అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో సర్వేపల్లి నియోజకవర్గ ఆర్వో చిన్నఓబులేసు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ విధులు నిర్వర్తిం చాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించు కోవాలన్నారు. అలాగే ఎన్నికల విధులకు హాజరయ్యే పోలీస్ సిబ్బందితో డీఎస్పీ వీరాంజనేయరెడ్డి సమావేశం నిర్వహించి విధులు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు.

● **కోవూరు:** నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో సోమ వారం సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లను అధి కారులు ఆదివారం పూర్తిచేశారు. 324 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు రిటర్నింగ్ అధికారులు ఏర్పాట్లు సిద్ధంచేశారు. పాలిటెక్నిక్ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ హరినారాయణ్ పరిశీలించి పలు సూచనలు చేశారు. పాలిటెక్నిక్ కళాశాల నుంచి ప్రత్యేక వాహనాల్లో ఈవీఎంలను పోలింగ్ స్టేషన్లకు చేరవేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వస తులు కల్పించారు. ఓటర్లకు, ఎన్నికల సిబ్బందికి తాగునీటి వసతి కల్పించారు, షామియానాలు ఏర్పాటుచేశారు. పోలింగ్ కేంద్రాల ప్రాంతంలో 144వ సెక్షన్ విధించారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి సేతు మాధవన్ పోలింగ్ కేంద్రాల్ని పరి శీలించి ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు ప్రక టించారు.

● **పొదలకూరు:** సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దారు వీరవసంతరావు, ఎంపీడీవో, మండల నోడల్ అధికారి మహమ్మద్ రఫీ వెల్లడించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతరం పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితిని తెలుసుకునేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మండలంలోని 69వేల మంది ఓటర్లకు సంబంధించి, 73 పోలింగ్ స్టేషన్‌లలో వెబ్‌కామ్ పెట్టామని, సమస్యాత్మకమైన 27 పోలింగ్ స్టేషన్లలో లోపలా, బయటా వెబ్ కెమెరాలు ఏర్పాటు



పొదలకూరు: గిరిజన కాలనీ పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న నోడల్ అధికారి

చేశామన్నారు. వృద్ధులకు, దివ్యాంగులకు పోలింగ్ స్టేషన్‌లలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మండలంలోని తాటిపర్తి గ్రామంలోని 11వ పోలింగ్ స్టేషన్‌లో మహిళా ఓటర్ల కోసం పింక్ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే పట్టణం లోనే బాలుర ఉన్నత పాఠశాలలో 49వ పోలింగ్ స్టేషన్‌ని మోడల్ పోలీస్ స్టేషన్‌గా రూపొందించామని, ఇందులో అన్ని వసతులు ఉంటాయన్నారు. ఓటర్లకు షామియా నాలు, తాగునీరు ఏర్పాటు చేస్తామన్నారు.

● **మనుబోలు:** సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ మండలంలో 19 పంచాయతీలకుగాను 42 పోలింగ్ కేంద్రాలు ఉన్నా యన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఆరుగురు అధికారులు, ఒక మైక్రో అబ్జర్వర్, ఒక వెబ్ కాస్టింగ్ అధికారి ఉంటారన్నారు. మండలానికి 336మంది సిబ్బందిని కేటా యించారన్నారు. బస్సుల ద్వారా పోలింగ్ సిబ్బందిని గ్రామాల్లోని కేంద్రాలకు తర లించామన్నారు. కేంద్రాల్లో కరెంటు, తాగునీరు, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పోలింగ్ సక్రమంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. దివ్యాంగులు, 85ఏళ్ళు పైబడిన వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చేందుకు ప్రభుత్వమే ఆటోలకు అనుమతులు ఇచ్చిందని, 19 పంచాయతీలకు 19 ఆటోలు ఏర్పాటుచేశామని, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాలు, పోలీసుల నిఘా ఉంటుందన్నారు.

● **తోటపల్లిగూడూరు:** మండలంలో సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికలు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దారు మాధవరెడ్డి తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద గట్టి బందోబస్తు, 144 సెక్షన్ ఏర్పాటు చేశామని ఎస్ఐ జంపానీ కుమార్ తెలిపారు.

● **బుచ్చిరెడ్డిపాళెం:** సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రానికి ఈవీఎంలతో ఎన్నికల అధికా రులు, సిబ్బంది చేరుకున్నారు. మొత్తం మండలంలో 78 పోలింగ్ కేంద్రాలకు ఒక్కో కేంద్రానికి ఒక్కో పోలీస్, పోలింగ్ అధికారులు చేరుకున్నారు. మండలానికి ఎన్నికల బందోబస్తు కింద మొత్తం 100మంది పోలీసులు వచ్చినట్టు సీఐ హైమారావు తెలిపారు. బందో బస్తుకు వచ్చిన వారిలో సివిల్, ఏఆర్ పోలీసులు, స్ట్రైకింగ్ ఫోర్స్, తమిళనాడు పోలీసులు వున్నట్టు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు.

● **సైదాపురం :** మండలంలోని 49పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. మండల ంలో 39,215 మంది ఓటర్లు ఉన్నారు. అందులో మహిళలు 20,175 మంది, పురుషులు 19,040 మంది. పోలింగ్ కేంద్రాల వద్ద 144సెక్షన్ అమల్లో ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఓటర్లు హక్కును సద్వి నియోగించుకోవాలన్నారు.



కోవూరు: ఎన్నికల సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది



బుచ్చిరెడ్డిపాళెం: చెల్లాయపాళెంలో మోడల్ పోలింగ్ కేంద్రం



పొదలకూరు: ఆదిశంకరులకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఉపాసకులు

ఘనంగా జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి

పొదలకూరు, మే 12 : పట్టణంలోని శివాలయంలో వైశాఖ శుద్ధ పంచమి ఆది వారం జగద్గురువు ఆదిశంకరాచార్యుల జయంతి మండల గాయత్రి ఉపాసక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు శివకుమార్ మాట్లాడుతూ బాల్యంలోనే హైందవ ధర్మ ప్రచారానికి భారతదేశమంతా నాలుగుసార్లు పర్యటించిన మహనీయులు ఆదిశంకరా చార్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడ ఆలయంలో ఆదివారం ఆదిశంకరా చార్య జయంతి వేడుకలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. ముందుగా జొన్న వాడ ఆలయంలో స్వామివారి విగ్రహమూర్తికి ఆలయ పండితులు, పురోహితులు వేదమంత్రాల నడుమ అభిషేకము, వస్త్రాధారణనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదములు నివేదించి అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. ఆ

నర్సుల సేవలు అభినందనీయం



ఫ్లోరెన్స్ నైటింగేల్‌కు నివాళులర్పిస్తున్న నర్సులు

కోవూరు, మే 12: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆదివారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ విజేత మాట్లాడుతూ నర్సుల సేవలు అభినందనీయమన్నారు. అనంతరం పలువురు నర్సుల్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటాచలపతి గౌడ్, జడ్పీ బాలికల ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి, పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు మారుతి నాగార్జున, హితేష్‌కుమార్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, మే 12 : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా గాంధీ ఆశ్రమ మేనేజర్ మనోజ్, మహాత్మాగాంధీ, పొనక కనకమ్మ విగ్రహాలకు నూలు మాలలు, ఖాదీ వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాగణంలో విషాదఛాయలు

సైదాపురం, మే 12: ఎన్నికల విధులకు వెళుతూ కావలి రైల్వేస్టేషన్ వద్ద పట్టాలు దాటుతూ ట్రైన్ ఢీకొన్న ఘటనలో మండలంలోని చాగణంకు చెందిన అంగన్‌వాడీ టీచర్ సుభాషిణి(55) ఆమె కుమారుడు విజయ్(25)లు దుర్మణం చెండటంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విజయ్ వాలంటీర్‌గా పనిచేస్తూ ఇటీవల రాజీనామా చేశాడు. తల్లి సుభాషిణికి వయసుపై పడటంతో తోడుగా వెళ్లాడు. రెండునెలల కిందట సుభాషిణి భర్త బట్టా ప్రకాష్ మృతి చెందిన ఘటన మరువక ముందే తల్లి, కుమారుడు మృతి చెందడంతో స్థానికులు, మృతిడి కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యా రు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం, మే 12: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన బుచ్చిరెడ్డిపాళెం టోల్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. మృతుడు అసోంకు చెందిన రాజన్ ముర్ము (28)గా గుర్తించారు. కొంతకాలంగా బుచ్చిలో మతి స్థితిమితం తప్పి తిరుగుతున్నట్టుగా పోలీసులు తెలిపా రు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నెల్లూరు సిటీ
నెల్లూరు రూరల్
సంగ్రామానికి సిద్ధం

● నేడు సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ ● పోలింగ్ బూత్‌లకు చేరిన సిబ్బంది, సామగ్రి
● ఉదయం 7గంటల నుంచి ప్రారంభం ● ప్రతి ఓటరుకు రెండు ఓట్లు ● ఒకటి ఎంపీకి మరోటి ఎమ్మెల్యేకు..

నగరం, పంచాయతీల కలయిక రూరల్

● బరిలో 11 మంది అభ్యర్థులు ● నియోజకవర్గం ఫలితంపై భారీ స్థాయిలో బెట్టింగ్

నెల్లూరు (వెంకటేశ్వరపురం) మే 12 : నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలో ఎన్నికల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. 110 ప్రాంతాల్లో 285 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 36 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఈ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేకంగా కేంద్ర బలగాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల విధులకు 1710 మంది సిబ్బందిని నియమించారు. కనుపర్తిపాడు సమీపంలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేసి ఉద్యోగులకు పోలింగ్ సామగ్రిని అందజేశారు. 106 బస్సుల్లో వీరందరినీ పోలింగ్ కేంద్రాలకు తరలించారు. నియోజకవర్గం పరిధిలో ఇప్పటికే ఎన్నికల విధుల విధులు కేటాయించిన 4741 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా, 266 మంది వృద్ధులు, వికలాంగులు హోం ఓటింగ్ ద్వారా ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, ఈ దఫా రూరల్ నియోజకవర్గంలో నాలుగు ప్రత్యేక పోలిం గ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో మోడల్ కేంద్రం ఒకటి కాగా, వృద్ధులు, వికలాంగులకు ఒకటి, మహిళలు, యువత కో సం చెరొకటి చొప్పున ఏర్పాటు చేశారు. రూరల్ నియోజకవర్గం నెల్లూరు నగరంలోని 26 డివిజన్లు, 18 గ్రామ పంచాయతీల్లో విస్తరించి ఉంది. ఇటు నగర ఓటర్లు, అటు గ్రామీణ ప్రాంత ప్రజలు ఇరువర్గాల కలయికతో ఉన్న నియోజకవర్గం కావడంతో అందరి చూపు దీనిపైనే ఉన్నది.

నెల్లూరు రూరల్

అభ్యర్థులు	11
మొత్తం ఓటర్లు	2,80,948
పురుషులు	1,36,691
స్త్రీలు	1,44.237
ఇతరులు	20
పోలింగ్ స్టేషన్లు	285
సమస్యాత్మకమైనవి	36
మోడల్ పీఎస్	1
మహిళా పీఎస్	1
యూత్ పీఎస్	1
వృద్ధులు, వికలాంగుల పోలింగ్ కేంద్రాలు	1
ఎన్నికల సిబ్బంది	1710
పోస్టల్ బ్యాలెట్	4741
హోం ఓటింగ్	266





ఎన్నికల విధులకు వెళుతున్న ఉద్యోగికి సూచనలిస్తున్న సిటీ ఆర్వో వికాస్



సిబ్బందికి ఇచ్చిన పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరి నారాయణన్

పోటీలో 15 మంది
సిటీపై సర్వత్రా ఆసక్తి

నెల్లూరు(సిటీ), మే 12 : సార్వత్రిక ఎన్నికల్లో చివరి అంకం మొదలైంది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు సామగ్రిని చేర్చారు. ఇవి జమిలీ ఎన్నికలు కావడంతో రాష్ట్రంలోని ప్రతి ఓటరు రెండు ఓట్లు వేయనున్నారు. ఒకటి అసెంబ్లీ స్థానానికికాగా మరొకటి పార్లమెంటు స్థానానికి ఓటు వేయాల్సి ఉంటుంది. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో 67 ప్రాంతాల్లో 248 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. సుబేదార్‌పేటలో మహిళలకు ప్రత్యేకించి పింక్ పోలింగ్ కేంద్రాన్ని, కోటమిట్టలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని అందుబాటులో ఉంచారు. 36 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించి అక్కడ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రియదర్శిని కళాశాల నుంచి పోలింగ్ కేంద్రాలకు శనివారం సిబ్బంది బస్సుల్లో బయల్దేరారు. వీరందరికి విధి, విధానాలు తెలియచేసిన ఆర్వో వికాస్ మర్మత్ చిన్న లోపం కూడా జరగనివ్వకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికలు సాఫీగా సాగేందుకు 22 మంది సెక్టార్ అధికారులు, 64 మందిని మైక్రో పరిశీలకులను నియమించారు. సిటీలో జరిగే పోలింగ్ ప్రక్రియను కార్పోరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షించనున్నారు. కాగా, నగర నియోజకవర్గంలో 2019 ఎన్నికలు హోరాహోరీగా జరగ్గా ఈ సారి నగర ఫలితం ఏకపక్షంగా ఉంటుందన్న ప్రచారం జరుగుతోంది. అయితే సిటీ ఓటరు ఎవరిని విజేతగా నిలుపుతారో, ఎంత మెజారిటీ ఇస్తారో అనే ఆసక్తి అందరిలోనూ ఉంది.

నెల్లూరు సిటీ

అభ్యర్థులు	15
మొత్తం ఓటర్లు	2,39,544
పురుషులు	1,16,764
స్త్రీలు	1,22.713
ఇతరులు	67
పోలింగ్ స్టేషన్లు	248
సమస్యాత్మకమైనవి	36
మోడల్ పీఎస్	1
మహిళా పీఎస్	1
యూత్ పీఎస్	-
వృద్ధులు, వికలాంగుల పోలింగ్ కేంద్రాలు	-
ఎన్నికల సిబ్బంది	1574
పోస్టల్ బ్యాలెట్	2698
హోం ఓటింగ్	148





నగరంలోని మూలాపేట వేద సంస్కృత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో క్యూలైన్లు, పోలింగ్ కోసం సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది



ఏ బండి ఎక్కాలో !: బస్సు ఎక్కేందుకు సిద్ధంగా ఉన్న సిబ్బంది



పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు సామగ్రితో బస్సు ఎక్కుతున్న ఎన్నికల సిబ్బంది

పురిటి పిల్లలకు
పెట్టావయ్యా నామం !

● నాలుగున్నరేళ్లుగా బేబి కిట్లు పంపిణీ చేయని ప్రభుత్వం
● జగన్ సర్కార్ తీరుపై లబ్ధిదారుల ఆగ్రహం
● టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చినవే దిక్కు !

నెల్లూరు (వైద్యం) మే 12: గత టీడీపీ ప్రభుత్వంలో నిరుపేదలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయించుకుంటే పురిటి పిల్లలకు బేబీ కిట్లు అందచేసేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ కిట్‌లను వైఎస్సార్ బేబీ కిట్‌ల పేరుతో కొద్ది నెలలు అందచేసి, ఆ తరువాత నిలిపివేసింది. ప్రస్తుతం వాటిని ఇవ్వక పోవటంతో లబ్ధిదారులు ఆగ్రహిస్తున్నారు.

పేదలను ఆదుకోవడం ఇలాగేనా..?

పేదరికం ఏ రూపంలో ఉన్నా తమ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నీ సభల్లోనూ సీఎం జగన్మోహన్ రెడ్డి ఢంకా బజాయిస్తూనే ఉంటారు. వైద్య శాఖ సమీక్షలో కూడా పేదలకు నాణ్యమైన వైద్యం అందించేలా పలు పథకాలు అమలు చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటారు. అయితే జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు కూడా పక్కదారి పట్టిస్తున్నారు. ఈ క్రమంలో నిరుపేద గర్భిణీలకు ప్రసవాల అనంతరం పురిటి పిల్లలకు అందిస్తున్న బేబీ కిట్‌లకు ప్రభుత్వం ఎప్పుడో రాంరాం చెప్పేసింది. దీంతో బాలింతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరోనా సాకుగా చూపి..

వైసీపీ ప్రభుత్వం కరోనాను సాకుగా చూపి ఈ పథకాన్ని ఆపేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. కరోనా ఉన్న సమయంలోనూ ఎంతోమంది నిరుపేదలకు ప్రస వాలు జరిగినా బేబీ కిట్‌లు అందచేయలేదు. ఏడాదిన్న రగా కరోనా కేసులు నమోదు కానప్పటికి బేబీ కిట్‌లను రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించలేదు. పైగా బేబీకిట్‌లను సరఫరా చేసే సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా బకా యిలు ఇవ్వాల్సి ఉండడంతో ఆయా సంస్థలు కిట్‌ల పంపిణీని నిలిపి వేశాయి. ఇది జరిగి రెండేళ్లపైగా కావ స్తున్నా నేటికీ బకాయిలు చెల్లించలేదు. దీంతో బేబీ కిట్‌ల పంపిణీ ఆగిపోయినట్లు తెలుస్తోంది. ప్రతి ఏటా జిల్లాలో 40వేలకుపైగా ప్రసవాలు జరుగుతున్నాయి. ఇందులో 10వేలకు పైగా ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే జరుగుతున్నాయి. వీరెవ్వరికీ కిట్‌లు అందలేదు.



పురిటి పిల్లల కోసం చంద్రబాబు అందచేస్తున్న బేబీ కిట్ (ఫైల్)

కిట్‌లో ఏమేమి ఉంటాయి..?

ఈ కిట్‌లో బేబీ టవల్, బేబీ బెడ్, లిక్విడ్ సోప్, దోమతెర, బేబీ అయిల్, హ్యాండ్ బ్యాగ్, నేప్‌కిన్, పౌడర్, డైపర్, షాంపూ, చిన్న బొమ్మలు, నిత్యావసరాలు ఉంటాయి. ఇవి పురిటి పిల్లలకు ఎంతోగానో ఉపయోగపడతాయి. నెల్లూరు జీజీహెచ్‌లో ప్రతి నెలా 400 ప్రసవాలు జరుగుతున్నాయి. అలాగే ఆత్మకూరు జిల్లా ఆసుపత్రిలోనూ, కందుకూరు, కావలి ఏరియా ఆసుపత్రు లలోనూ, 10 సీహెచ్‌సీల్లోనూ మరో 600కు పైగా ప్రసవాలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో వీరందరికీ బేబీ కిట్‌లు అందిం చాల్సి ఉంటుంది. ఆసుపత్రిలో నర్సింగ్ సిబ్బందిని బేబీ కిట్‌లపై బాలింతలు ప్రశ్నిస్తున్నా తమ చేతిలో ఏమి లేదని వారు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వం చర్యలపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



జీజీహెచ్‌లోని ప్రసూతి వార్డు

ప్రభుత్వం నుంచి సరఫరా లేదు



ప్రభుత్వం బేబీ కిట్‌లను సరఫరా చేయటం లేదు. దీంతో వాటిని మేము పంపిణీ చేయటం లేదు. ఈ ప్రభుత్వం ఎందుకు పంపిణీ చేయలేదో తెలియదు. బేబీకిట్‌లు వస్తే వెంటనే అందచేస్తాం.

\- డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

అడిగితే లేవన్నారు..!



పురిటి పిల్లల సంరక్షణకు గతంలో బేబీ కిట్‌లు ఇచ్చేవారు. ఇప్పుడు నర్సింగ్ సిబ్బందిని అడిగితే రాష్ట్ర ప్రభు త్వం సరఫరా చేయటం లేదని చెప్పారు. ప్రభుత్వం నిరుపేదలకు ఆసుపత్రుల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావటం లేదు. ఉచిత సరఫరా లేక బేబీకిట్‌ను బయట మార్కెట్‌లో ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి వస్తున్నది. - లక్ష్మి (బాలింత)

రామానుజాయ నమః

నెల్లూరు (సాంస్కృతికం), మే 12 : సమతామూర్తి భగవద్రా మానుజాచార్యుల జయంతి సందర్భంగా ఆదివారం తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఉత్సవాలు జరిగాయి. ఉదయం రామానుజుల వారికి బంగారు తిరుచ్చిలో పేట ఉత్సవం, శ్వేత చత్రాలతో ఉత్సవం జరిగింది. అనంతరం మంగళాశాసనోత్సవం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి, భగవద్రామానుజులచార్యులకు విశేష తిరుమంజనం జరిగింది. ఆ తర్వాత పెద్ద శేషవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామికి, తిరుచ్చిలో భగవద్రామా నుజాచార్యులకు ఉత్సవం వైభవంగా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి తిలకించా రు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, ఉభయకర్తలు, సహాయ కమిషనర్, ఈవో డీ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

రంగడి ఆలయంలో సమతామూర్తి ఉత్సవాలు

● సమరసతా వేదిక ఆధ్వర్యంలో రంగడి ఆలయం ముందు భాగంలో ఉన్న భగవద్రామానుజాచార్యుల విగ్రహానికి పూజలు చేసి ఆయన విశిష్టతను భక్తులకు వివరిం చారు. లక్ష్మీనారాయణ, మోమిడి శ్రీనివాసులు, దాసరి రాజేంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

● అల్లూరి సీతారామరాజు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామానుజాచార్యుల జయంతి పూజలు జరిగాయి. పేదలకు ఆహార పొట్లాలు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షురాలు రమాదేవి, జయప్రకాస్ తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని శివాజీ సెంటర్‌లో భక్త బృందాల ఆధ్వర్యంలో రామాజనుజుల చిత్రపటానికి పుష్పమాలలు వేసి విశేష పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



భగవద్రామానుజాచార్యులకు తిరుచ్చి ఉత్సవం



పెద్ద శేషవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి

భక్తిశ్రద్ధలతో శంకర జయంతి

మూలస్థానేశ్వర ఆలయంలో వసంతోత్సవాల ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), మే 12 : జగద్గురువు ఆదిశంకరాచార్యుల జయంతిని నగర వాసులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మూలస్థానేశ్వరాలయంలో ఉదయం గణపతి పూజ, గణపతి హోమం జరి గాయి. ఆదిశంకరాచార్యులకు విశేష పూజలు జరిగాయి. వేదపారాయణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా, మూలస్థానేశ్వర ఆలయంలో వసంతోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి విశేష అలంకారం, పూజలు, పూలంగిసేవ జరిగాయి. శంకర జయంతి అలంకారం భక్తులకు కనువిందు చేసింది. ఆలయ పాలక మండలి, ఈవో వేణుగోపాల్ పర్యవేక్షించారు.

● **ఆదిశంకర ధ్యానమందిరంలో..**

నగరంలో పొగతోటలోని ఆదిశంకర ధ్యానమందిరంలో జగద్గురువు జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం ఆదిశంకరాచార్యులకు విశేష పూజలు, పుష్పాలంకరణ చేశారు. సాయంత్రం జయంతి సభ జరిగింది. ఆదిశంకరులు రచించిన సౌందర్య లహరిపై అష్టావధాని కోట రాజశేఖర్ ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమంలో ధ్యాన మందిరం మేనేజర్ సీవీఎల్ నరసింహం, చక్రాలవారి ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ప్రవచన కర్త రాజశేఖర్‌ను నిర్వాహకులు సత్కరించారు.



ధ్యానమందిరంలో ప్రవచనకర్త రాజశేఖర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు



మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో శంకర జయంతి అలంకారం

ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY 5 తిరుపతి జిల్లా వార్తలు

సోమవారం 13 మే 2024

తీర్పు నేడే

ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్

7గంటల నుంచి ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం



ఓటు గంగమ్మ విశ్వరూపం

పాలకుడు ప్రజాకంటకుడుగా మారితే గంగమ్మ వెతికి వెతికి వేటాడి సంహరిస్తుందని తిరుపతి గంగజాతర ఐతిహ్యం చెబుతుంది. అధికారపు అహంకారంతో ప్రజను చెరబట్టే పాలెగాడి పీచ మణచడమే గంగమ్మ అవతారం ఉద్దేశ్యం. ఎన్నికల పేరుతో జాతరను వాయిదా వేయకుండా ఉండి వుంటే సరిగ్గా ఈరోజుతో మారువేషాలతో గంగమ్మ వేట ముగిసి ఉండేది. మంగళవారం అర్ధరాత్రి విశ్వరూపియై పాలెగాడి సంహారం జరుగుతుంది. విధ్వంసాలతో, అరాచకపు దాడులతో, కబ్జాలతో, బాదుడుతో సాగిన ఐదేళ్ల ప్రజాకంటక పాలనపై నేడు గంగమ్మ ఓటరుగా మారి తన ఆగ్రహ ప్రకటన చేయబోతోంది. అబద్ధాల వెనుక దాగిన పాలకుడిని బయటకు ఈడ్చి ఓటు రూపంలో ఈవీఎంలో సంహారానికి సిద్ధమైంది. ఓటర్లలో సగానికి పైగా సంఖ్యగలిగిన మహిళలే నేడు పాలకుల భవితను నిర్ణయించబోతున్నారు. పాలెగాడా.. కాసుకో!

పోలింగ్‌కు సర్వం సిద్ధం



పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో బయల్దేరిన సిబ్బంది

తిరుపతి(కలెక్టరేట్), మే 12: సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి ఆదివారం మధ్యాహ్నమే పోలింగ్ సిబ్బంది ఈవీఎం యూనిట్లు, వీవీ ప్యాట్‌లు, ఇతర సామగ్రిని తీసుకుని ఎస్కార్ట్ మధ్య బస్సుల్లో ఆయా పోలింగ్‌కేంద్రాలకు సాయంత్రం చేరుకున్నారు. ఎన్నికల విధుల్లో 14,769మంది పీవో, ఏపీవో, ఇతర పోలింగ్ సిబ్బంది ఉన్నారు. వీరి తోపాటు పోలింగ్ సరళిని పరిశీలించేందుకు మైక్రో అబ్జర్వర్లను నియమించారు. రాజకీయనేతల సమక్షంలోనే ఉదయం 5.30గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభమవుతుంది. తర్వాత ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుంది. ఈవీఎంలలో ఏదైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే ప్రతి నియోజకవర్గానికి ముగ్గురు భెల్ ఇంజనీర్లను ఏర్పాటు చేశారు. అలాగే అదనపు ఈవీఎంలను కూడా సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు ఉండేలా చర్యలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను నిషేధించారు. 200 మీటర్ల పరిధిలో ఎలాంటి వాహన రాకపోకలు లేకుండా నిషేధం విధించారు. ఎపిక్‌కార్డు లేనివారు ఎన్నికల కమిషన్ సూచించిన 12 గుర్తింపుకార్డుల్లో ఏదో ఒకటి తీసుకురావచ్చు.

1,401పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్

ఈ దఫా చంద్రగిరి, తిరుపతిలో వందశాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. జిల్లాలో 2,140 పోలింగ్ కేంద్రాలుండగా అత్యంత సమస్యాత్మకమైన 1,401 చోట్ల వెబ్‌కాస్టింగ్ ఉంటుంది. వెబ్‌కాస్టింగ్ లేని 899 కేంద్రాల్లో వీడియో గ్రఫీ ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అలజడి జరిగినా తక్షణం స్పందించేలా కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటైంది.

మోడల్ పోలింగ్ కేంద్రాల అలంకరణ వివాదం

యువత, మహిళలను పోలింగ్ కేంద్రాలకు రప్పించి ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాలో కొన్ని చోట్ల మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాట్లు చేసింది. అయితే ఇక్కడ వైసీపీ రంగులతో కూడిన బెలూన్లు, చలువపందిళ్లు ఏర్పాటు చేయడంతో టీడీపీ, జనసేన నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అలంకరణ తీవ్ర వివాదాస్పదమైంది.



నేడు స్థానిక సెలవు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా స్థానిక సెలవు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అన్ని ప్రైవేటు, స్థానిక సంస్థలు, కార్యాలయాలు, పరిశ్రమలు, పబ్లిక్, ప్రైవేటు విద్యాసంస్థలు, బ్యాంకులకు కూడా సెలవు ప్రకటించారు. జిల్లాలో ప్రజలు స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు.

బరిలో ఉన్న అభ్యర్థులిలా..

జిల్లాలో ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సోమవారం ఎన్నికలు జరగనున్నాయి. తిరుపతి పార్లమెంటు బరిలో 23 మంది అభ్యర్థులున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 133మంది పోటీ చేస్తున్నారు. అత్యధికంగా తిరుపతిలో 46మంది, అత్యల్పంగా సూళ్లూరుపేటలో 9మంది బరిలో ఉన్నారు. చంద్రగిరిలో 24మంది, శ్రీకాళహస్తి, సత్యవేడులో 15మంది చొప్పున, గూడూరులో 14మంది, వెంకటగిరిలో 10 పోటీ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు18,12,980మంది ఉన్నారు. పురుషులు 8,83,330, మహిళలు 9,29,466, ఇతరులు 184మంది ఉన్నారు. 2,140పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఓటెయ్యడం మరువకండి

ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలని కోరుతూ చిల్లకూరు మండలం ఏరూరు గ్రామానికి చెందిన సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ ఆదివారం సముద్రతీరంలో ఈ సైకత శిల్పాన్ని రూపొందించారు. సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలనేదే ఈ శిల్పం వుద్దేశమన్నారు.

- చిల్లకూరు





మాకొద్దీ నాసిరకం చీరలు

రేణిగుంట మండలం విప్పమాను పట్టెడ ఎస్టీ కాలనీలో ఆదివారం రాత్రి గ్రూపు లీడరు ఇంటివద్ద వైసీపీ నాయకులు చీరలు అందరికీ పంచమని ఇచ్చారు.ఆమె ఇండ్ల వద్ద కెళ్లి పంచగా వాటిని నాసిరకమంటూ రోడ్లో పడేసి మహిళలు నిరసన తెలిపారు.పైగా పట్టణంలో ఓటర్లకు రూ.మూడువేలిచ్చి మాకు 1500 మాత్రమే ఇస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

- రేణిగుంట

దొంగ ఓట్లు వేయాలని ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు:ఎస్పీ



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

తిరుపతి(నేరవిభాగం), మే 12: దొంగ ఓట్లు వేయాలని ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ హెచ్చరించారు. తిరుపతిలో ఆదివారం ఆయన సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. ఎక్కడికక్కడ కేంద్ర సాయుధ బలగాలు ఉంటాయని, ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఇప్పటివరకు దాదాపు 4,500 మంది పోలీసు సిబ్బంది, కేంద్ర సాయుధ బలగాలు, రిటైర్డు పోలీసులు, మాజీ ఆర్మీ సిబ్బంది, తమిళనాడు పోలీసులు, ట్రైనీ ఐపీఎస్‌లు తదితరులు భారీ ఎత్తున ఎన్నికల విధుల్లో ఉన్నారన్నారు. క్రిటికల్ పోలింగ్ బూత్‌ల వద్ద అదనపు బలగాలను నియమించామని తెలిపారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన 400 మంది పోలీసులు బందోబస్తు విధుల్లో ఉంటారన్నారు. 46 క్విక్ రియాక్షన్ టీమ్‌ల్లో 184 మంది, 286 రూట్ మొబైల్ పార్టీలతో 858 మంది సిబ్బంది, ప్రతి స్టేషన్‌కు అదనపు క్యూఆర్‌టీ టీమ్‌లు, ప్రతి సర్కిల్‌కు 11 క్యూఆర్‌టీ టీమ్‌లు ఉన్నాయని వివరించారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమల్లో ఉందన్నారు. ఎవరైనా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పోలింగ్ రోజు జిల్లాలో ఎవైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే డయల్ 100కి కానీ జిల్లా పోలీసు వాట్సాప్ నెంబరు 80999 99977కు సమాచారం చేరవేయాలని కోరారు. ఓటర్లు వెబ్ నిఘాలో ఉన్నామనే విషయాన్ని మరచిపోకూడదన్నారు.

ఏనుగు దాడిలో ఒకరి దుర్మరణం

తవణంపల్లె, మే 12: ఒంటరి ఏనుగు దాడిలో ఒకరు చనిపోయారు.చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలంలోని వెంగంపల్లె ఎస్టీ కాలనీకి చెందిన చిన్నయ్య(50) ఆదివారం ఉదయం బహిర్భూమి నిమిత్తం గ్రామ సమీపంలోని మామిడి తోపులోకి వెళ్లాడు. అప్పటికే అక్కడున్న ఒంటరి ఏనుగు ఆయనను చెట్టుకేసి కొట్టి, కాలితో తొక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకునే లోపు ఏనుగు వెళ్లిపోయింది.

భూమన వ్యాఖ్యలపై ఆగ్రహం

గళమెత్తిన జర్నలిస్టులు, ప్రజా సంఘాలు

తిరుపతి, మే 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎన్నికల ప్రచార ముగింపు సభలో జర్నలిస్టులపై టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చేసిన దూషణలు, నిరాధార ఆరోపణలు తీవ్ర దుమారం రేపాయి.విచక్షణ కోల్పోయి మాట్లాడిన ఆయన వ్యవహార శైలిపై జర్నలిస్టు, ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టుల అంతు చూస్తామని బెదిరించిన కరుణాకర రెడ్డి నుంచి ప్రాణహాని ఉందని ఆదివారం జర్నలిస్టు సంఘాల నేతలు కలెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్‌లకు ఫిర్యాదు చేశారు.అంతకు ముందు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఉద్దేశపూర్వకంగా ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు, స్టాఫ్ రిపోర్టర్ నరేంద్రలపై భూమన వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని పలువురు జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టు సంఘాల నాయకులు ప్రసాదరెడ్డి, తూపల్లె జనార్దన్, గిరిబాబు, మునిరాజు, లక్ష్మీపతి, మురళి, దినేష్‌కుమార్, శ్రీకాంత్, గిరిధర్, పరంధామ తదితరులు మాట్లాడుతూ జర్నలిస్టులపై కరుణాకరరెడ్డి వ్యక్తిగత విమర్శలు చేయడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. వామపక్ష ఉద్యమ నేపథ్యం వచ్చానంటూ తరచూ చెప్పుకునే భూమన ప్రజాస్వామిక సంప్రదాయాన్ని మరిచిపోయారని విమర్శించారు.భూమన వ్యాఖ్యలు జర్నలిస్టుల మీద కాకుండా పత్రికా స్వేచ్ఛపై దాడిగా భావించాలని,ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకోకుండా పటిష్ఠ ఉద్యమ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలన్నారు. జర్నలిస్టులకు భూమన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రెస్ క్లబ్ ఆవరణలో భూమన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అక్కడి నుంచి నేరుగా వెళ్లి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. భూమన కుటుంబం, అతని అనుచరుల నుండి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు. దీంతో జరిగిన ఘటనపై పూర్వాపరాలు పరిశీలించి కేసు నమోదు చేయాలని డీఎస్పీకి ఆయన ఆదేశాలిచ్చారు. సాయంత్రం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేసిన జర్నలిస్టులు స్వేచ్ఛాయుత వాతావరణంలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ జరిగిన సంఘటనపై ఎస్పీతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామన్నారు.ఉన్నమాటంటే ఉలుకెక్కువ అన్న చందాన తనకు వ్యతిరేకంగా వార్తలు రాసినందుకు వృత్తి నిబద్ధత కలిగిన జర్నలిస్టులను దూషించడం భూమన అసహనాన్ని బయటపెడుతోందని పౌరహక్కుల సంఘం ఉపాధ్యక్షుడు క్రాంతి చైతన్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన స్థాయిని మరిచి ఆంధ్రజ్యోతి పాత్రికేయులను వ్యక్తిగతంగా బెదిరించడం తగదని సీపీఐ నేతలు పి.మురళి,వి.నాగరాజు అభిప్రాయపడ్డారు. జర్నలిస్టులపై కరుణాకర రెడ్డి చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు హెచ్చరించారు. ఓడిపోతామన్న ఆందోళనతో జర్నలిస్టుల అంతుచూస్తామని హెచ్చరించడం ఆయన పతనానికి పరాకాష్ట అని టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ మండిపడ్డారు. ఉన్నత విలువలు కలిగిన జర్నలిస్టులు ఉమామహేశ్వర రావు, నరేంద్రలపై విమర్శలు చేయడం సిగ్గుచేటని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు మండిపడ్డారు.ఇటువంటి అసత్య ప్రచారాలు పత్రికాస్వేచ్ఛకు భంగకరమని మాజీ మంత్రి పరసా రత్నం అభిప్రాయపడ్డారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేస్తున్న జర్నలిస్టులు

ఓటేసేటప్పుడు ఇవి గమనించండి!

- వేలిపై ఇంకుముద్ర వేశాక ఈవీఎం ఆన్ అవుతుంది.
- ఈవీఎం ఆన్‌చేయగానే బీప్ అనే శబ్దం వస్తుంది.
- మిషన్ దగ్గర ఆకుపచ్చ లైట్ వెలుగుతుంది.
- అప్పుడే మిషన్‌పై గుర్తు నొక్కాలి.
- అప్పుడు కూడా బీప్ శబ్దం వస్తుంది.
- వీపాట్‌లో అభ్యర్థి ఫొటోను, గుర్తు పక్కాగా గుర్తించాలి
- బటన్ నొక్కగానే ప్రింట్ అయి కింద ఉన్న బాక్స్‌లో పడుతుంది.
- హడావిడిలో ఇవన్నీ మనం ఈ విషయాలను గమనించం. అధికారులను కూడా అడగం, మిషన్ నొక్కేసి అంతా బాగుందని వెళ్లిపోతాం..
- ఒకవేళ అనుమానం వచ్చి అధికారులను అడిగినా ఏదో సర్ది చెబుతారు.
- ఇవన్నీ గమనించకపోతే మన ఓటు నమోదు కాకుండా పోయే అవకాశం కూడా ఉంది.



- నెల్లూరు (సాంస్కృతికం)

ఓటర్ స్లిప్పులు ఎగ్గొట్టి..
నగదు నొక్కేసి !

చోటామోటా నేతలతో బీఎల్వోల లాలూచీ

కావలి, మే12: అక్రమార్జనకు అవకాశం ఉన్నంతవరకు కొంత మంది దేన్నీ కూడా వదలరు. ఇందుకు ఉదాహరణ ఇదిగో... సార్వత్రిక ఎన్నికలకు ఓటర్లకు నగదు పంచే విషయంలో కొందరు బీఎల్వోలు, వివిధ పార్టీల చోటామోటానేతలతో లాలూచీ పడి ఓటర్ల డబ్బులను కొట్టేశారు. బీఎల్వోలు అందచేసిన స్లిప్పులు చూపిస్తేనే ఓటర్లకు కావలిలో డబ్బులు పంపిణీ చేశారు. బీఎల్వోలు ప్రతివార్డుకు 100 మంది వరకు స్థానికంగా లేనివారు, డబుల్ ఎంట్రీ ఉన్నవారి స్లిప్పులు వారి వద్దనే ఉంచుకున్నారు. అలాంటి వారు ఫోన్ చేస్తే పోలింగ్‌బూత్ వద్దకు వచ్చినపుడు అక్కడ ఇస్తానని చెబుతున్నారు. డబుల్‌ఎంట్రీ స్లిప్పులను ఇళ్లకు ఇవ్వగా, బీఎల్వో వద్ద ఉన్న స్లిప్పులను తీసుకుని కొందరు డబ్బులు పంచేవద్దకు వెళ్లారు. అయితే వాటికి డబ్బులు ఇచ్చినట్లు వారు నోట్ చేసుకుని ఉండటంతో ఈ స్లిప్పులకు డబ్బులు ఇచ్చామే... మళ్లీ ఎలా వచ్చాయని ఆశ్చర్యపోతున్నారు. మరికొందరు బీఎల్వోలు వార్డు ఇన్‌చార్జిలకే నేరుగా స్లిప్పులు ఇవ్వడంతో వారిలో కూడా కొందరు పంపిణీ డబ్బులను నొక్కారనే ప్రచారం ఉంది.

కల్లుకు గిరాకీ


మద్యం దుకాణాల మూతతో డిమాండ్



ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ మద్యం దుకాణాలకు తాళాలు పడ్డాయి. దీంతో కల్లు దుకాణదారులు తమ వ్యాపారాన్ని జోరుగా కొనసాగించారు. మండలంలోని గువ్వాడి, తూర్పుబోయమడగల, జీ.కొండారెడ్డిపల్లి, ఇస్కపల్లి, జడదేవి, వరికుంట పాడు, మహమ్మదాపురం, తూర్పురొంపిదొడ్ల, పెద్దిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో కల్లు విక్రమాలు బాగా సాగాయి. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు కొనసాగాయి. అదే అదునుగా భావించిన వ్యాపారులు నాసిరకం కల్లు విక్రయిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఎన్నికల వేళ కల్లు అమ్మకాలను కూడా నియంత్రించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- వరికుంటపాడు

ఈ బండితో వేట సాధ్యమేనా!?



కావలి రూరల్ : అసలే ఎన్నికలు.. ఏ క్షణాన్నైనా ఏమైనా జరగొచ్చు. అంత పకడ్బందీగా ఉండాలి. కానీ, ఈ పోలీస్ జీపును చూశారా!? ఎన్నికల విధులకు వచ్చి కావలి పోలీస్ పరేడ్ మైదానంలో ఇలా ఆగిపోయింది. ఇంకేముంది. పరుగు తీసేందుకు మొండికేసిన ఈ జీపును అక్కడే ఉన్న కొంతమంది ఇలా నెట్టుతూ కనిపించారు!?. ఈ దృశ్యం ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బందించింది.

సజావుగా పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు

- నిరంతరాయంగా పరిశీలన
- వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలనలో కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), మే 12 : నేటి(సోమవారం) ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్‌ను సజావుగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేశామని కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. ఎన్నికల సామగ్రిని పంపిణీ చేసే డిస్ట్రిబూషన్ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజవర్గాల పరిధిలోని 2,470 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.

● నిరంతరాయంగా పరిశీలన

పోలింగ్ ప్రక్రియను నెల్లూరులోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా నిరంతరాయంగా పరిశీలించేందుకు అన్నీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు ఆయన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. సీ విజిల్, 1950 కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు అన్నీ బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిస్టికల్ సర్వైయల్ టీములు నిరంతరం నిఘా ఉంచి తనిఖీలు చేపట్టాలన్నారు. సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలను కూడా పరిశీలించాలన్నారు. రాజకీయ ప్రకటనలు ప్రసారం కాకుండా చూడాలన్నారు. ఎక్కడైనా ప్రసారమైతే వెంటనే చర్యలకు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్‌బూత్‌ల్లో పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.



కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించిన అనంతరం మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

● ఆ ప్రచారాన్ని నమ్మవద్దు..

జిల్లాలో చెరగని సిరా ద్వారా ఓటర్ల వేలిపై వారి ఇంటి వద్దే మార్కుచేస్తూ ఓటు హక్కును వినియోగించుకోకుండా చూడాలనే కుట్ర జరుగుతున్నదంటూ సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. చెరగని సిరాను ప్రభుత్వం మాత్రమే తయారు చేస్తుందని, ఈ సిరా భారత ఎన్నికల సంఘం వద్ద మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు : ఎస్పీ

నెల్లూరు(క్రైం) : శాంతి భద్రతలు పరిరక్షిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని జిల్లా ఎస్పీ కే ఆరీఫ్ హాఫీజ్ పోలీసు అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఎస్పీ సుడిగాలి పర్యటన చేపట్టారు. పలు నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆత్మకూరులోని ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాల, ఉదయగిరిలోని ఇంటిగ్రేటెడ్ బీసీ హాస్టల్ గ్రౌండ్, కావలి, కందుకూరు పరిధిలోని ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను, నెల్లూరు డీకేడబ్ల్యూ కళాశాల, వెంకటాచలంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి, చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు సూచనలిచ్చామ న్నారు. బారికేడ్ల ఏర్పాట్లు, ఓటర్ల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్, తదితర ఏర్పాట్లపై సూచనలు చేశామన్నారు. ప్రజలు తమ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగిం చుకోవడమేలక్ష్యంగా ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. బందోబస్తు నిర్వహణ తీరును సీసీ టీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ఏ చిన్న సమస్య తెలెత్తినా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించామన్నారు. పోలింగ్ బూత్‌ల దగ్గర ఓటర్లు, ప్రజలు గుంపులు గుంపులుగా ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌కు సీఆర్‌పీఎఫ్ బలగాలను కేటాయించామని చెప్పారు.



వలసవాసులు వచ్చేశారు!

కావలి/ఉదయగిరి రూరల్ : ఓట్లు వేసేందుకు వలసవాసులు ఆదివారం సొంతూళ్లకు చేరడంతో మెట్టప్రాంతంలోని పల్లెలు, పట్టణాల్లో సందడి వాతా వరణం నెలకొంది. ఉదయగిరి నియోజకవర్గంలో 2,41,677 ఓట్లు ఉండగా, 40 శాతం మంది ఓటర్లు పొట్టచేత పట్టుకుని ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ప్రధానంగా సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, కొండాపురం, కలిగిరి మండలాలకు చెందిన వారు బెంగుళూరు, హైదరాబాదు, చెన్నై, గోవా, పూణె, విజయవాడ తదితర ప్రాంతాలకు వలస వెళ్లారు. వీరంతా రావడంతో ఆదివారం ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్ కిటకిటలాడింది. ఇక కావలి నియోజకవర్గంలో సుమారు 20వేల మంది ఇతర ప్రాంతాల్లో ఉంటున్నట్లు సమాచారం. వీరంతా బస్సులు, రైళ్లు, సొంత వాహనాల్లో స్వగ్రామాలకు చేరుకున్నారు. వీరందరికీ ఆయా పార్టీల నాయకులు నాయ కులు ప్రయాణ, భోజనం, ఇతర ఖర్చులు భరించడంతోపాటు ఓటుకు ఇంతమొత్తం ఇస్తామని చెప్పి పిలిపించినట్లు సమాచారం. కొందరు నాయకులు ఏకంగా ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేశారు.

‘గిరి’లో ఉక్కపోత

అల్లాడిపోయిన సిబ్బంది, సొమ్మసిల్లిన కానిస్టేబుల్



ఉదయగిరి రూరల్ : ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం ఈవీఎంల పంపిణీ కేంద్రం వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర అవస్థలు పడ్డారు. మండుటెండలో నీడ కోసం షామియానాలు ఏర్పాటు చేసినా పూర్తిస్థాయిలో ఫ్యాన్లు లేకపోవడంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఓ వైపు కారుతున్న చెమట, మరోవైపు ఎన్నికల సామగ్రి సరి చూసుకోలేక ఉద్యోగుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఏ ఉద్యోగి చేతిలో చూసినా పేపర్, అట్టముక్క, కర్చీఫ్ పట్టుకుని గాలి విసురుకుంటూ కనిపించారు. మరోవైపు తాగునీరు క్యాన్లలో ఏర్పాటు చేయడంతో దాహం తీర్చుకొనేందుకు వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. వాష్‌రూమ్స్, మరుగుదొడ్లు కూడా సక్రమంగా లేవు. ఉక్కపోతను తట్టుకోలేక ఓ కానిస్టేబుల్ సొమ్మసిల్లి పడిపోయాడు.

ఓటర్లకు ప్రయాణ కష్టాలు

- హక్కు వినియోగానికి వచ్చి బస్సుల కోసం పడిగాపులు
- ఆర్టీసీ గ్రామీణ సర్వీసులు రద్దు
- గంటల తరబడి బస్టాండ్లలో నిరీక్షణ
- ప్రమాదకరంగా ఆటోల్లో ప్రయాణం
- సంగంకు చార్జీ రూ.300, ఆత్మకూరు రూ.500
- అధికారుల తీరుపై ఆగ్రహం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట). మే 12: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చిన ప్రజలు ఆదివారం ఆర్టీసీ బస్టాండ్లలో బస్సులు లేక అష్ట కష్టాలు పడ్డారు. పనులు మానుకొని, ఎంతో ఖర్చు పెట్టుకుని కుటుంబంతోసహా రైళ్ల, ప్రైవేటు ట్రావెల్స్, ఆర్టీసీ బస్సుల్లో నెల్లూరుకి చేరుకున్నారు. ఇక్కడి నుంచి వారివారి స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్సులు లేక ఆర్టీసీ ప్రధాన బస్టాండు, ఆత్మకూరు బస్టాండ్లలో వేలాదిమంది ఉండిపోయారు. దీంతో ఆర్టీసీ సిబ్బందిని వారు ప్రశ్నించడంతో బస్సులన్నీ ఎన్నికల విధులకు వెళ్లాయని, గ్రామీణ సర్వీసులను పూర్తిగా రద్దు చేశామని చెప్పారు. దీంతో చేసేది లేక పలువురు అధిక చార్జీలు చెల్లించి ఆటోల్లో వెళ్లారు.

● అధికారుల తీరుపై ఆగ్రహం

తమ ప్రాంతాలకు బస్సులు లేవని తెలియడంతో జిల్లా అధికారులపై ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎన్నికలు జరుగుతుండటంతో ఆదివారమే ఓటర్లు వస్తారని అధికారులకు తెలియదా ? అని వారు ప్రశ్నించారు. ఎన్నికల విధులకు ఆర్టీసీ బస్సులను పంపినప్పుడు ప్రత్యమ్నాయ రవాణా ఏర్పాట్లు చేయా లని అధికారులకు తెలియదా ? అని ప్రశ్నించారు. ఆర్టీసీ బస్టాండ్లు ఖాళీగా మారడంతో నేరుగా ఆటోలు ఆయా ప్లాట్‌ఫారమ్‌ల వద్ద వచ్చి ప్రయాణికులను ఎక్కించుకున్నారు. నెల్లూరు నుంచి సంగంకు ఆటో చార్జి రూ.300, ఆత్మకూరుకు రూ.500, ఇలా దూరాన్ని బట్టి రూ.100నుంచి రూ.800 వసూలు చేశారు. ఒక్కొక్క ఆటోలో 15 నుంచి 25 మందిని ఎక్కించుకుని ప్రమాదకరంగా ప్రయాణించారు. ఇక ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు రంగంలోకి దిగి, చెన్నై, తిరుపతి, ఒంగోలు ప్రాంతాల వైపు అధిక చార్జీలు వసూలు చేస్తూ తిరిగాయి.



ఆత్మకూరు బస్టాండులో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు



బస్సులు లేక ఆటోల్లో ప్రయాణిస్తున్న ప్రజలు

నిర్మాణ రంగాన్ని
కూల్చేసిన జగన్

వేలాదిమంది జీవితాలు అతలాకుతలం
కార్మికుల పొట్టగొట్టిన వైసీపీ సర్కార్






నెల్లూరు (సాంస్కృతికం) మే 12 : జగన్ సీఎం పీఠం ఎక్కగానే భవన నిర్మాణ రంగాన్ని దారుణంగా దెబ్బతీశారు. ఉచిత ఇసుక విధానం ఎత్తివేసి, దోపిడీకి శ్రీకారం చుట్టారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అరకోటికిపైగా, జిల్లాలో లక్షన్నరకుపైగా కార్మికుల జీవితాలు అతలాకుత లం అయ్యాయి.

● కార్మిక సంక్షేమం గాలికి..

1996లో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేశారు. నిర్మాణ రంగం నుంచి ఒక శాతం సెస్సు వసూలు చేసి, ఆ నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వినియోగించేవారు. 2019 నాటికి దాదాపు రూ. ఆరువేలకోట్లపైగా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ నిధులు ఉంటే, వాటిని జగన్ ప్రభుత్వం దారి మళ్లించింది.ఈ 58 నెలల కాలంలో ఒక్క రూపాయి కూడా లేకుండా చేసింది.జిల్లాలో ఒకటిన్నర లక్షలకుపైగా భవన నిర్మాణ కార్మికులుంటే అందులో 60వేల మందికి పైగా కార్మికశాఖలో నమోదై ఉన్నారు. 1996 నుంచి 2018 వరకు కార్మిక సంక్షేమ నిధులను భవన నిర్మాణ కార్మికులు అందుకున్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు రూ.50 సభ్యత్వం, సంవత్సర చందా రూ.12 చొప్పున ఐదేళ్లకు రూ.60లు మొత్తం రూ.110 చెల్లించి పేరు నమోదు చేసుకుని గుర్తింపు కార్డు పొందాలి. కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షలు, ప్రమాదంలో 25 శాతం అంగవైకల్యానికి రూ.25వేలు, 46 శాతం వైకల్యానికి రూ.50 వేలు, 50 నుంచి 75 శాతం వైకల్యానికి రూ.లక్ష, శాశ్వత వైకల్యానికి రూ.5లక్షలు ఇస్తారు. సహజ మరణానికి రూ.60వేలతోపాటు అంత్యక్రియలకు (మట్టి ఖర్చులు) సాయం పొందేవారు. భవన నిర్మాణ కార్మికుడి కుటుంబంలో కుమార్తె వివాహానికి ఖర్చులు, రెండు కాన్పులకు ప్రసూతిసాయం రూ.20వేలు లభించేవి. తాత్కాలిక వైకల్యం, అనారోగ్యానికి గురైన కార్మికుడికి రోజుకు రూ.2వేలు, గరిష్ఠంగా రూ.3వేలు అందచేసేవారు. ఈ సాయం 2019 సంవత్సరానికి ముందు వరకు లభించింది. 2019 నాటికి ఆర్థిక సాయం కోసం కార్మిక శాఖకు చేసుకున్న దరఖాస్తులు దాదాపు 2వేలకు పైగా ఉన్నాయి. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక సంక్షేమ నిధులకు మంగళం పాడింది. కార్మికుడు చనిపోతే కనీసం మట్టి ఖర్చులు (అంత్యక్రియలు) కూడా పైసా ఇవ్వని పరిస్థితి నెలకొంది.దీంతో భవన నిర్మాణ కార్మికులు రోడ్లెక్కి నిరసనలు, ధర్నాలు చేశారు. అయినా సీఎం జగన్ మనసు కరగలేదు. ఈ 58నెలల జగన్ ప్రభుత్వ పాలనలో భవన నిర్మాణ కార్మికులు, పనులు లేక, సంక్షేమ పథకాలు అందక అల్లాడిపోయారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో వసూలు చేసిన సెస్సు రూ.14,57, 45,650. కానీ వారి కోసం ఖర్చు చేసింది రూపాయి కూడా లేదు. ఈ విధంగా వైసీపీ ప్రభుత్వం కార్మికుల కడుపులు కొట్టింది.



మోసం గురూ!

సమాంతరంగా సచివాలయ వ్యవస్థ ● మీ సేవ కేంద్రాలపైనే ప్రజల మక్కువ
వాటి నుంచి ప్రభుత్వ సర్వీసుల తొలగింపు ● సెంటర్ల మూత, వీధినపడ్డ నిర్వాహకులు

జగనొచ్చాడు..
మీ సేవలకు రాం రాం !

సంగం, మే 12 : గ్రామీణ ప్రాంతాల్లో సులభంగా, వేగంగా ఎల్లవేళలా ప్రజలకు సేవలు అందచేసే మీ సేవ కేంద్రాలు జగనన్న రాకతో మూతపడ్డాయి. వాటికి సమాంతరంగా సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వాటిల్లో సేవలు అందచేసేందుకు ప్రభుత్వ ఉద్యోగులను నియమించినా మీ సేవ కేంద్రాల్లో మాదిరిగానే ప్రతి సర్వీసుకు రుసుం వసూలు చేస్తున్నారు. రెండింట్లో ఒకే రుసుం వసూలు చేయడం, సచివాలయాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5-00 గంటల వరకే పని చేస్తుండడంతో ప్రజలు మీ సేవ కేంద్రాలపట్లే మొగ్గు చూపేవారు. అంతేకాక మీ సేవ కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉండడంతో వాటికి ఆదరణ తగ్గలేదు. ఈ క్రమంలో సచివాలయాల పట్ల ప్రజలు మొగ్గు చూపడం లేదని, క్రమేణా మీ సేవ కేంద్రాల్లో సర్వీసులను తొలగిస్తూ వచ్చారు. దీంతో వాటి నిర్వాహణ భారమై మూత పడ్డాయి. ఫలితంగానిర్వాహకులు వీధిన పడ్డారు.

250కి పైగా కేంద్రాలు

జిల్లాలో 2012లో మీసేవ కేంద్రాల పేరుతో ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ప్రతి మండలంలో రెండు కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇవి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుండడంతో కేంద్రాల సంఖ్యను పెంచింది. దీంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 250 కేంద్రాలకుపైగా ఏర్పాటయ్యాయి. ఈ కేంద్రాల్లో సుమారు 542 రకాల సర్వీసులను ప్రభుత్వ నిర్దేశించిన రుసుంతో అందచేసేవారు. ప్రతి పనికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగకుండా సులభంగా, వేగంగా పనులు జరిగేవి.

సచివాలయాలతో తిప్పలు

సచివాలయంలో కూడా మీసేవ కేంద్రాల్లో అందే 542 సర్వీసులను అందచేస్తామన్నారు. అయితే అక్కడుండే సిబ్బంది ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకే అందుబాటు ఉంటున్నారు. ప్రజలు ఆ సమయంలోనే వెళ్లాలి. ఒకవేళ వెళ్లినా వారు ఇతర ప్రభుత్వ పనుల్లో బిజీబిజీగా ఉండేవారు. ఒక్కొక్కసారి ఆన్‌లైన్ పనిచేయలేదనో.. ఇతర కారణాలతో ప్రజలకు పనులు చేసేవారు కాదు. అదే మీ సేవ కేంద్రాల వారు ఎల్ల వేళలా అందుబాటులో ఉంటారు. ఆర్వోఆర్-1బీ, అడంగల్ వంటి పత్రాలు ఫోన్ చేసి వచ్చేలోపు ఇస్తుండడంతో సౌలభ్యంగా ఉండేది. కానీ సచివాలయాల్లో అలా జరగడంలేదు.

కేంద్రాల మూత

ప్రభుత్వ సర్వీసులన్నీ మీ సేవ కేంద్రాల్లో తొలగించడంతో కేవలం ప్రైవేట్ సర్వీస్‌లపైనే మీ సేవ ఆపరేటర్లు ఆధారపడవలసి వచ్చింది. దీంతో అవి జరక్క క్రమేణా మూతపడ్డాయి. దీంతో పట్టణాల్లో తప్ప మండలాలు, గ్రామాల్లో చూద్దామన్నా మచ్చుకైనా కనిపించడం లేదు. దీంతో నిరుద్యోగులు ఉపాధి కోల్పోయారు.




సంగంలో మూతపడిన మీ సేవ కేంద్రం

బతుకు దెరువు కోల్పోయాం



సచివాలయాల ఏర్పాటుతో మీసేవ కేంద్రాలకు ప్రభుత్వ సర్వీసులు నిలిపివేయడం దారుణం. సర్వీసులన్నీ ఉంచితే ప్రజలకు మెరుగైన సేవలు అందేవి. కానీ గత ప్రభుత్వంలో ఏర్పాటైన మీసేవ కేంద్రాలు ఉండ కూడదనే ఉద్దేశంతో మీ సేవ కేంద్రాలపై కక్షి కట్టి సర్వీసులను తొలగించింది. దీంతో మా బతుకు దెరువు పోయింది.

- జీ. గిరీష్, మీసేవ నిర్వాహకుడు, సంగం



ఓటు వేయండిలా...

బీప్ శబ్దం వస్తేనే ఓటేసినట్టు సుమా..

గతంలో ఓటేసినా చాలామందికి ఈవీఎం అనగానే సందేహాలే. కొత్తవారికి మరీనూ. అందుకే ఓటు వేయకమునుపే వాటి గురించి ఒకసారి తెలుసుకుంటే మంచిది. సాధారణంగా పోలింగ్ బూత్‌లో ముగ్గురు అధికారులు వుంటారు.

1 బూత్‌లోకి ప్రవేశించాక ఓటరు తీసుకు వెళ్లే స్లిప్‌ను మొదటి అధికారి పరిశీలిస్తారు. ఏదో ఒక ఐడీ చూపించాక ఓటరు వివరాలను తన దగ్గర ఉన్న జాబితాతో సరిపోల్చుకుంటారు. ఆ కేంద్రంలో అక్కడే ఉన్న వివిధ పార్టీల ఏజెంట్లు కూడా ఆ ఓటరు పేరు, వరుస క్రమం చెక్ చేసుకుంటారు.



2 అప్పుడు ఓటరు పక్కనే ఉన్న రెండవ అధికారి వద్దకు వెళ్లాలి. సదరు అధికారి కూడా ఓటరు వివరాలను మరోసారి పరిశీలిస్తారు. ఓకే అని భావించాక ఆ ఓటరు నుంచి సంతకం తీసుకుంటారు. నిరక్షరాశ్య ఓటర్లైతే వేలిముద్ర తీసుకుంటారు. తర్వాత ఓటరు ఎడమచేతి చూపుడు వేలి చివరిన సిరా గుర్తు పెడతారు.



3 సిరా ముద్ర వేశాక మూడో అధికారి వద్దకు వెళ్లాలి. ఆ అధికారి కూడా స్లిప్ వివరాలను చెక్ చేస్తారు. కంట్రోల్ యూనిట్ మీట నొక్కి ఓటు రిలీజ్ చేస్తారు. ఓటు రిలీజ్ చేయకముందు కంట్రోల్ యూనిట్‌పై ఎడమ వైపు ఆకుపచ్చ రంగు ఎల్ఈడీ లైట్ వెలుగుతూ ఉంటుంది. ఓటు రిలీజ్ చేశాక కుడివైపు ఎరుపు రంగు లైట్ వెలుగుతుంది. దీనిని ఓటరు పరిశీలిస్తే మంచింది.



4 నాలుగోదశలో ఓటరు బ్యాలట్ యూనిట్ ఉన్నచోటకు వెళ్లాలి. ఆ యూనిట్‌పై అతికించిన బ్యాలట్ పేపరుపై అభ్యర్థుల పేర్లు, గుర్తులు ఉంటాయి. తనకు నచ్చిన అభ్యర్థి పేరు, గుర్తు ఉన్న మీట నొక్కాలి. వెంటనే దాని పక్కన బాణం గుర్తులో ఎర్రని లైట్ వెలుగుతుంది. వెంటనే బీప్ అనే శబ్దం వస్తుంది. తర్వాత బ్యాలట్ యూనిట్‌పై ఆకుపచ్చ రంగులైట్ ఆరిపోతుంది.



5 ఆ యూనిట్ దగ్గరలోనే వీవీప్యాట్ పరికరం నుంచి ఒక స్లిప్ కనిపిస్తుంది. ఓటు వేసిన అభ్యర్థి పేరు, గుర్తు కనిపిస్తాయి. ఇది కొద్ది క్షణాలపాటే కనిపిస్తుంది. ఓటరు తాను వేసిన ఓటు సదరు అభ్యర్థికి పడిందో లేదో తెలుసుకునేందుకు ఇదో అవకాశం.



- ఒకేసారి ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలు జరుగుతున్నందున రెండు బ్యాలట్ యూనిట్లు ఉంటాయి. ఇద్దరు అభ్యర్థులకు వేరువేరుగా ఓటు వేయాల్సి ఉంటుంది.
- ఓటు మీట నొక్కిన తరువాత బీప్ అనే శబ్దం రాకపోతే ఓటు పడలేదని గమనించాలి. సందేహమొచ్చినా తేడా ఉన్నట్లు గుర్తించినా వెంటనే మాక్ పోల్ స్లిప్ ద్వారా ఎన్నికల ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయాలి.

ఓటరు గుర్తింపు కార్డులివే..



పోలింగ్ రోజున ప్రతి ఒక్కరు తమతో పాటు పోలింగ్ స్టేషన్‌కు విధిగా వ్యక్తిగత గుర్తింపు కార్డును తీసుకెళ్లాలి. లేని పక్షంలో ఎన్నికల అధికారులు తిరస్కరించడానికి అవకాశం ఉంది. ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఫొటో ఓటరు గుర్తింపుకార్డు లేదా 12రకాల కార్డులను మాత్రమే ఎన్నికల అధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. ఓటరు ఐడీ (ఎపిక్‌కార్డు) లేని వారు ఈ 12 రకాల కార్డులలో ఏదో ఒకకార్డు ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవచ్చు.

1. ఇండియన్ పాస్‌పోర్టు 2. ఆధార్‌కార్డు 3. డ్రైవింగ్ లైసెన్సు 4.సర్వీసు గుర్తింపు కార్డు(కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు/ పీఎస్‌యూలు/ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు తమ ఉద్యోగులకు జారీ చేసినవి) 5. పాస్‌బుక్ (ఫోటోతో పాటు బ్యాంకు/ పోస్టాఫీసుల్లో జారీ చేసినవి) 6. పాన్‌కార్డు 7. స్మార్ట్‌కార్డు(కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ చేసినవి) 8. ఉపాధి హామీపథకం జాబ్‌కార్డు 9. ఆరోగ్య భీమా స్మార్ట్ కార్డు (కార్మిక మంత్రిత్వశాఖ పథకం కింద జారీ చేసినవి) 10. ఫోటో పింఛను పత్రం 11. ప్రత్యేక వైకల్యం కార్డు(కేంద్ర ప్రభుత్వం జారీచేసింది) 12. అధికారిక గుర్తింపు కార్డు(ఎంపీలు/ఎమ్మెల్యేలు/ఎమ్మెల్సీలకు జారీ చేసినవి)

- తిరుపతి (నేరవిభాగం)/తిరుపతి(కలెక్టరేట్)

జన కేతనం





తిరుపతి ప్రచారంలో చంద్రబాబు,పవన్



తిరుపతి రోడ్‌షోలో నడ్డా

సమరం సాగిందిలా...

పోలింగ్ ఘడియలు సమీపించాయి. ఓటేసేందుకు నరాలు తెగే ఉత్కంఠ రేపిన క్షణాలు దగ్గరపడ్డాయి. ఎన్నికల నోటిఫికేషన్ మొదలు గడచిన పాతిక రోజులుగా ఎన్నో పరిణామాలు వడివడిగా చోటుచేసుకున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఆరంభంలో అసమ్మతులు.. ముఖ్య నేతల జోక్యంతో కుదిరిన సమన్వయం..హోరెత్తించిన ప్రచారంలో పాలుపంచుకున్న అగ్ర నాయకులు..కురిపించిన హామీలు..అధికార పార్టీని తుదివరకూ ముచ్చెమటలు పట్టించిన చేరికలు..గడచిన 24 గంటల్లో బేరసారాలు.. లాంటి పలు ఆసక్తికర సంఘటనలతో సాగిన ఎన్నికల సమరం శనివారం సాయంత్రానికి క్లైమాక్సుకు చేరుకుంది.. వాటిని ఒకసారి మననం చేసుకుంటే...

- తిరుపతి (ఆంధ్రజ్యోతి)

అగ్రనేతలతో హోరెత్తిన ప్రచారం

అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారం హోరెత్తించారు. తిరుపతిలో వైసీపీ అభ్యర్థి అభినయ్‌రెడ్డి ప్రత్యక్ష ప్రచారంలో పెద్దగా పాల్గొనలేదు. మిగిలిన అభ్యర్థులు ప్రత్యక్ష ప్రచారంలో తలమునకలయ్యారు.

చంద్రబాబు: గూడూరు, నాయుడుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు, తిరుపతిలలో బహిరంగసభలు నిర్వహించి పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు.

నారా లోకేష్: చంద్రగిరిలో హలో లోకేష్ పేరిట యువతతో ముఖాముఖీ సమావేశమయ్యారు. తిరుపతిలో రోడ్‌షో నిర్వహించారు.

నందమూరి బాలకృష్ణ: వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో పర్యటించారు.

పవన్ కళ్యాణ్: తిరుపతి రోడ్‌షో సూపర్ హిట్ చేశారు.

జేపీ నడ్డా: బీజేపీ అధ్యక్షుడు తిరుపతి రోడ్‌షోకు హాజరయ్యారు. లోకేష్, నాగబాబు కూడా ఇందులో పాల్గొన్నారు.

వైఎస్ జగన్: శ్రీకాళహస్తిలో డ్రైవర్లతో ముఖాముఖి సమావేశమయ్యారు. వెంకటగిరి, నాయుడుపేట, పుత్తూరుల్లో సభలకు హాజరయ్యారు.

వైఎస్ షర్మిల: శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరుల్లో పర్యటించి ఎన్నికల సభల్లో పాల్గొన్నారు.

మంద కృష్ణ మాదిగ: చంద్రగిరిలో టీడీపీకి మద్దతుగా రెండు సార్లు పర్యటించారు.

వంగవీటి రాధాకృష్ణ: చంద్రగిరిలో టీడీపీకి మద్దతుగా కాపులతో సమావేశమయ్యారు.

- జతకట్టిన కూటమి నాయకులు
- అసంతృప్తి వీడి విజయానికి కృషి
- అధికార వైసీపీకి అసమ్మతుల బొప్పి
- పార్టీ అగ్ర నాయకుల పర్యటనలు
- జిల్లా అభివృద్ధికి పలు హామీలు
- ఓట్ల కొనుగోలుకు తాయిలాలు
- పాతిక రోజుల ఉత్కంఠకు నేడు తెర



తిరుపతిలో చంద్రబాబు,పవన్

ముఖ్య నేతల హామీలివే!

చంద్రబాబు:

- గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేస్తా.
- శ్రీకాళహస్తి-తిరుపతి-కాణిపాకంలను టెంపుల్ కారిడార్ చేసి టూరిజం హబ్‌గా అభివృద్ధి పరుస్తా.
- తిరుపతి-శ్రీకాళహస్తి, నెల్లూరులను కలిపి ట్రైసిటీగా అభివృద్ధి చేస్తా.
- గాలేరు-నగరి, హంద్రీ-నీవా, సోమశిల-స్వర్ణముఖి ప్రాజెక్టులు పూర్తి చేస్తా.
- సత్యవేడును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా. సాగునీటి ప్రాజెక్టులను ఆధునికీకరిస్తా. బైపాస్ రోడ్లు, సత్యవేడు డిగ్రీ కాలేజీకి శాశ్వత భవనాలు నిర్మిస్తా. సత్యవేడు, వరదయ్యపాలెంలను నగర పంచాయతీలుగా అప్‌గ్రేడ్ చేస్తా.

నారా లోకేశ్: చంద్రగిరిలో ఐటీ కంపెనీలు ఏర్పాటు చేయిస్తా. **వైఎస్ జగన్:** పులికాట్ పూడికతీత పనులు చేయిస్తా.

కూటమిలో సర్దుబాటు.. వైసీపీలో తలపోటు



పుత్తూరు ప్రచారంలో జగన్

కూటమి మధ్య ఆరంభంలో లుకలుకలు కొంత కలవరపెట్టాయి. తిరుపతిలో టీడీపీ నుంచీ టికెట్ ఆశించినా దక్కని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఊకా విజయ్‌కుమార్, జేబీ శ్రీనివాస్, జనసేన నుంచి హరి ప్రసాద్, కిరణ్ రాయల్, బీజేపీ పక్షాన భానుప్రకాష్ రెడ్డి తదితరులు అసమ్మతి స్వరం వినిపించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నాగబాబుల చొరవతో వీరంతా సర్దుకున్నారు.

- చంద్రగిరిలో డాలర్స్ దివాకర్‌రెడ్డి, బడి సుధా యాదవ్ వంటివారు సర్దుకుని టీడీపీలో చేరి అభ్యర్థి విజయానికి పనిచేస్తున్నారు.
- నగరిలో వైసీపీ టికెట్ రోజాకు వద్దని పోరాడిన అసమ్మతి నేతలు తుదకు పార్టీనే వీడారు.
- శ్రీకాళహస్తిలో ఎస్సీవీ నాయుడు, కోలా ఆనంద్, నగరం వినుత వంటి అధినేతల నిర్ణయాలకు తలొగ్గి అభ్యర్థి విజయానికి కృషి చేస్తున్నారు.
- సత్యవేడులో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలం టీడీపీ అభ్యర్థి అయ్యారు. చిత్తూరు జిల్లా నుంచీ నూకతోటి రాజేశ్ ఇక్కడ వైసీపీ అభ్యర్థిగా తెర మీదకు వచ్చారు. టికెట్ ఆశించిన టీడీపీ నేతల్లో హేమలత, డాక్టర్ హెలెన్‌లు సైలెంటయ్యారు. జేడీ రాజశేఖర్ తిరుగుబాటు అభ్యర్థిగా బరిలోకి దిగి సస్పెండయ్యారు.
- సూళ్ళూరుపేట టీడీపీ టికెట్ మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం కుమార్తె విజయశ్రీకి దక్కగా ఆ పార్టీలో అన్ని వర్గాలూ ఒక్కటై ఎన్నికల్లో పనిచేస్తున్నాయి. వైసీపీలో వర్గ విభేదాలు ఇంకా పెరిగాయి.
- గూడూరులో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాద్ బీజేపీలో చేరి తిరుపతి ఎంపీ టికెట్ సాధించారు. ఎమ్మెల్సీ మురళీధర్ వైసీపీ అభ్యర్థిగా అక్కడ పోటీలో దిగారు.
- వెంకటగిరిలో టీడీపీ టికెట్ తొలుత మాజీ ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీసాయిప్రియకు దక్కగా నామినేషన్ల చివరి క్షణంలో రామకృష్ణకే టికెట్ ఇచ్చారు. అక్కడ వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పార్టీలో వర్గ విభేదాలతో సతమతమవుతున్నారు.

వైసీపీ నుంచీ టీడీపీలోకి భారీగా చేరికలు

నగరిలో రోజాకు టికెట్ వద్దని పోరాడి అలసిన వైసీపీ ముఖ్యనేతలు చక్రపాణిరెడ్డి, మురళీధర్‌రెడ్డి, లక్ష్మీపతి రాజు, అమ్ములు మొదలియార్ వంటివారు పార్టీ వీడి టీడీపీలో చేరారు. తిరుపతిలో వైసీపీ నుంచీ బీసీ నేత అన్నా రామచంద్రయ్య సహా పలువురు వైసీపీ కార్పొరేటర్లు, డివిజన్ పార్టీ అధ్యక్షులు పార్టీ వీడారు. చంద్రగిరిలో డాలర్స్ దివాకర్‌రెడ్డి, బడి సుధాయాదవ్, పాకాల జడ్పీటీసీ నంగా పద్మజ, సాయినగర్ మాజీ సర్పంచ్ గణపతి నాయుడు, పారిశ్రామికవేత్త రమణమూర్తి వంటి వారు టీడీపీలో చేరారు. వెంకటగిరి ఎంపీపీ తనూజ, సైదాపురం జడ్పీటీసీ ప్రసన్న, మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌రావు, డీసీసీబీ మాజీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, పెంచలకోన ఆలయ ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి తదితరులు వైసీపీ నుంచీ టీడీపీలో చేరారు. శ్రీకాళహస్తి మున్సిపల్ మాజీ ఛైర్మన్ ముత్యాల పార్థసారథి, శాప్ డైరెక్టర్ వీరరాఘవులు టీడీపీలో చేరారు. నగరిలో అశోక్ రాజు టీడీపీ నుంచీ, తిరుపతిలో నవీన్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ నుంచీ బీజేపీలో చేరారు.

ఓటు..నోటు బేరసారాలు

మున్నెన్నడూ లేనివిధంగా ఈసారి ఓటు బేరసారాలు జరిగాయి. గరిష్ఠంగా ధర రూ. 3500 వరకూ పలికింది. వెంకటగిరిలో వైసీపీ రూ. 3500, టీడీపీ రూ. 2500 చొప్పున, గూడూరులో వైసీపీ రూ. 1500 నుంచీ రూ. 2 వేలు, టీడీపీ రూ. వెయ్యి వంతున ఓటర్లకు పంపిణీ చేశాయి. సూళ్ళూరుపేటలో ఇరుపార్టీలూ రూ. వెయ్యి చొప్పున పంపిణీ చేశాయి. వైసీపీ అదనంగా మద్యం అందజేసింది. శ్రీకాళహస్తిలో వైసీపీ నాయకులు రూ. 3500, చీరలు, ముక్కుపుడక, వెండి మెట్టెలు ఇచ్చారు. టీడీపీ నాయకులు రూ. 2 వేలు లెక్కన పంచారు. సత్యవేడులో వైసీపీ రూ. 1500, టీడీపీ రూ. వెయ్యి వంతున, నగరిలో వైసీపీ రూ. 2 వేల నుంచీ రూ. 2500, టీడీపీ రూ. వెయ్యి వంతున ముట్టజెప్పాయి. తిరుపతి, చంద్రగిరిలలో ఇరు పార్టీల వారూ రూ. 2 వేలు వంతున అందజేశారు.

కనిపించని మద్యం ప్రభావం

ఈ ఎన్నికల్లో మద్యం ప్రభావం పెద్దగా కనిపించకపోవడం విశేషం. సూళ్ళూరుపేట, నగరి నియోజకవర్గాల్లో వైసీపీ వర్గీయులు నగదుకు తోడు మద్యం పంపిణీ చేశారు తప్పితే మిగిలిన నియోజకవర్గాల్లో మద్యం పంపిణీ జరగలేదు.

ఓటర్లలో పైమెట్టు.. ప్రాతినిధ్యం తీసికట్టు

- జిల్లా ఓటర్లలో మహిళలే అధికం
- ఎన్నికల బరిలో అతితక్కువ ప్రాధాన్యం



జిల్లాలో అభ్యర్థుల విజయాన్ని ప్రభావితం చేసే స్థితిలో మహిళా ఓటర్లున్నా చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం అంతంతమాత్రంగానే ఉంటోంది. ఈసారి ఎన్నికలు జరిగే ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సంఖ్యాపరంగా ఓటర్లలో వీరెక్కువగానే ఉన్నారు. జిల్లా అధికారులు విడుదల చేసిన తుది జాబితా ప్రకారం 18,12,980 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుష ఓటర్ల కంటే 46,136 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో అధిక సంఖ్యలో అంటే 1,62,109మంది మహిళా ఓటర్లున్నారు. అయినా జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల నుంచి ప్రధాన రాజకీయ పార్టీల నుంచి ఇద్దరే పోటీపడుతున్నారంటే వీరి ప్రాతినిధ్యం ఏమేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. సూళ్లూరుపేట నుంచి నెలవల విజయశ్రీ (టీడీపీ),నగరి బరిలో ఆర్కే రోజా(వైసీపీ) బరిలో ఉన్నారు.

జిల్లాలో ఓటర్ల గణాంకాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
గూడూరు	1,19,164	1,26,007	34	2,45,205
సూళ్లూరుపేట	1,18,094	1,24,492	24	2,42,610
వెంకటగిరి	1,18,888	1,24,690	4	2,43,582
చంద్రగిరి	1,52,988	1,62,109	62	3,15,159
తిరుపతి	1,49,846	1,52,622	35	3,02,503
శ్రీకాళహస్తి	1,19,973	1,28,549	14	2,48,536
సత్యవేడు	1,04,377	1,10,997	11	2,15,385
మొత్తం	8,83,330	9,29,466	184	18,12,980

ప్రతి ఎన్నికలో అంతంతమాత్రం

అనుకున్నట్టుగా మహిళాబిల్లు అమలైతే 2029లో జరిగే అసెంబ్లీ, లోక్‌సభల్లో సగం సీట్లు మహిళలకు కేటాయించాల్సిందే. అప్పటివరకూ వీరు అరకొరతో సరిపెట్టుకోవల్సిందేనని చరిత్ర చెబుతోంది. ఈ ఎన్నికల వేళ ప్రస్తుత, పూర్వపు ఉమ్మడి జిల్లా నుంచి మహిళా ప్రాతినిధ్యం ఒకసారి పరిశీలిస్తే.. కుతూహలమ్మ అయిదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వేపంజరి నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు గెలిచారు. జీడీనెల్లూరు ఏర్పడ్డాక 2009లో ఒకసారి విజయం సాధించారు. అయిదు సార్లు గెలిచినా ఈమె హ్యాట్రిక్ మిస్సయ్యారు. ఆ ఘనతను చంద్రగిరి నుంచి 1999, 2004,2009లలో వరుసగా ఎన్నికైన గల్లా అరుణకుమారి దక్కించుకున్నారు. ఈమె అంతకుముందు 1989లో కూడా చంద్రగిరి నుంచి గెలిచారు. సుగుణమ్మ(తిరుపతి-2015), రోజా (నగరి-2014,2019),హేమలత (సత్యవేడు-2009), లలితకుమారి (పలమనేరు-2009),ఝాన్సీలక్ష్మి(చిత్తూరు-1983), సత్యప్రభ (చిత్తూరు-2014),అనసూయమ్మ(తంబళ్లపల్లి-1967, 1972),ఏవీ లక్ష్మీదేవమ్మ (తంబళ్లపల్లి-1985, 1994) ప్రాతినిధ్యం వహించారు. తొలినాళ్లలో పుంగనూరు నుంచి 1970,1972లలో రాణి సుందర్మణి గెలుపొందారు.తిరుపతి జిల్లాలో విలీనం కాక మునుపు వెంకటగిరి నుంచి నేదురుమల్లి రాజ్యలక్ష్మి 1999,2004లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

- తిరుపతి(కలెక్టరేట్)

కరెంటు పోయినా ఈవీఎం ఓకే..

కరెంటు పోతే ఈవీఎం పనిచేయదా? ఓటు వేసే సమయంలో కరెంటు పోతే ఈవీఎం పనిచేస్తుందా లేదా అన్న సందేహం చాలామందిలో ఉండొచ్చు. కానీ మన ఈవీఎంలు విద్యుత్ కనెక్షన్లు లేకపోయినా పనిచేస్తాయి. సాధారణ 7.5 వోల్ట్ ఆల్కలిన్ పవర్‌ప్యాక్‌తో పనిచేస్తాయి

- మొరాయిస్తే...

ఈవీఎంలు మొరాయిస్తే పోలింగ్‌కు అంతరాయం కలుగుతుంది. ఈవీఎంలో కంట్రోల్ యూనిట్ (సీయూ), వీవీప్యాట్, బ్యాలెట్ యూనిట్ (బీయూ) మూడు సక్రమంగా పనిచేయాలి. సీయూ, బీయూ పనిచేయకపోతే వాటితో పాటు వీవీ ప్యాట్‌ను మార్చి తనిఖీ చేస్తారు. సీయూ బ్యాటరీ, వీవీ ప్యాట్ పనిచేయకపోతే వాటిని మాత్రమే మారుస్తారు. పోలింగ్ మధ్యలో మొరాయించినా, పనిచేయకపోయినా కొత్తవి ఏర్పాటు చేస్తారు. అప్పటివరకు పోలైన ఓట్ల వీవీప్యాట్లను భద్రపరుస్తారు. ఓట్ల లెక్కింపు అనంతరం వీవీ ప్యాట్లతో ఫలితాలు తారుమారయ్యే అవకాశం ఉంటేనే వీవీ ప్యాట్లను లెక్కిస్తారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఖైదీలకూ ఓటు అవకాశం

వివిధ కారణాలతో జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు కూడా ఓటుహక్కు వినియోగించుకోవచ్చు. వారు తమ నియోజకవర్గం, పోలింగ్‌బూత్, ఓటరు క్రమసంఖ్యను తెలియజేస్తూ జైలు అధికారిని రాతపూర్వకంగా కోరాలి. వారి అభ్యర్థన లేఖను జిల్లా ఎన్నికల అధికారులకు ఆయన అందజేస్తారు. ఆ దరఖాస్తును పరిశీలించాక రిటర్నింగ్ ఆఫీసర్ పోస్టల్ బ్యాలెట్‌ను తెప్పించి ఖైదీలకు ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. పీడీ చట్టం కింద ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో కడప సెంట్రల్‌జైలులో ఉన్న ఓ ఖైదీ ఇలా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అతనికి మాత్రం అవకాశం కల్పించారు. మిగిలిన ఖైదీలెవరూ పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోలేదని అధికారులు తెలిపారు. కాగా మానసికవైకల్యం ఉన్నవారికి ఓటు వేసే అవకాశం ఉండదు.

-తిరుపతి(కలెక్టరేట్)

చూపుడు వేలు లేకుంటే సిరాచుక్క ఇలా...

సాధారణంగా పోలింగ్ బూత్‌లోకి వెళ్లగానే స్లిప్ వివరాలు పరిశీలించాక ఓటు వేసే ముందు ఎడమచేతి చూపుడు వేలిమీద నీలిరంగు సిరా చుక్క పెడతారు. ఈ సిరాచుక్క ఉందంటే ఓటేసినట్లు గుర్తు. ఒకవేళ ఓటరు ఎడమ చేతికి చూపుడు వేలు లేకపోతే ఏ వేలుకు సిరా చుక్క పెడతారనే సందేహం కొందరికి రావచ్చు. గతంలో దీనిపై అధ్యయనం చేసిన ఎన్నికల సంఘం ప్రత్యామ్నాయ విధానాన్ని సూచించింది. మధ్య వేలు లేదా బొటన వేలుమీద సిరా చుక్క పెట్టొచ్చని పేర్కొంది. కుడి చేయి చూపుడు వేలుకు, ఉంగరం వేలుకు కూడా ఈచుక్క పెట్టవచ్చు. రెండు చేతులకు వేళ్ళు లేకపోతే ఏంచేస్తారనుకుంటున్నారా.. అలాంటి పరిస్థితి ఎదురైతే చేతిపై భాగంలోనూ సిరా చుక్క పెట్టే వెసులుబాటు కల్పించింది.

- తిరుపతి (నేరవిభాగం)

మన ఓటే మన గళం

యూట్యూబ్‌లో సునాదవాణి పాటలతో ఓటరు చైతన్యం



మన ఓటే మన గళం.. మన ఓటే మన ఆయుధం అంటూ పాటల రూపంలో జనచైతన్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది తిరుపతికి చెందిన సునాదవాణి సంస్థ. ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రతి ఒక్కరూ ఓటు వేయాలనే పిలుపును పాట, ఆట రూపంలో ఆల్బమ్‌లు రూపొందించి యూట్యూబ్‌లో విడుదల చేశారు. మన ఓటు మనం వేయకపోతే దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందనే హెచ్చరిక వీరి పాటల్లో చేశారు. ఈ పాటలను సునాదవాణి వ్యవస్థాపక అధ్యక్షులు వాణిశ్రీ రాసి, స్వరకూర్చారు. శిరీష, తనుశ్రీ, వసుప్రదలు పాడారు. సునాదవాణి పేరుతో యూట్యూబ్‌లో ఈ పాటలు చూడచ్చు.

- తిరుపతి


గూడూరు డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సిబ్బందికి కలెక్టర్ సూచనలు


సూళ్లూరుపేట నుంచి బయలుదేరుతున్న ఎన్నికల సిబ్బంది


ఈవీఎంలు, వీవీపాట్‌తో గూడూరు నుంచి బయలుదేరుతున్న సిబ్బంది

ఓట్ల పండుగకు సర్వం సిద్ధం


వెంకటగిరిలో ఎన్నికల సామగ్రితో సిబ్బంది

గూడూరు, మే 12: సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ చెప్పారు. ఆదివారం గూడూరు పట్టణంలోని జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ వీడియోగ్రఫీ ఏర్పాటు చేశామన్నారు. సాంకేతిక కారణాలతో ఈవీఎంలు మొరాయిస్తే వెంటనే అదనపు మెషిన్లను అందుబాటులో ఉంచామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లుకు ఇబ్బందులు తలెత్తకుండా వసతులను కల్పించామన్నారు. 108 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని, మరో 147 కేంద్రాలలో వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లు తప్పనిసరిగా గుర్తింపుకార్డును తెచ్చుకోవాలన్నారు.

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట నియోజకవర్గానికి సంబంధించి సార్వత్రిక ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పోలింగ్ జరిగే 304 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు ఇతర సామగ్రితో కేటాయించిన రూట్లలో ఎన్నికల సిబ్బంది తరలివెళ్లారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఆర్వో చంద్రముని ఆధ్వర్యంలో ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు.



వెంకటగిరి టౌన్: వెంకటగిరి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సన్నద్ధం చేసింది. ఏపీఆర్ ఎస్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈవీఎంలు, వీవీపాట్‌లు, ఇతర సామగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు సంబంధిత సిబ్బంది తీసుకెళ్లినట్టు ఆర్వో ధ్యాన్‌చంద్ తెలిపారు. 148 కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్, 58 సమస్యాత్మక కేంద్రాల్లో వీడియోగ్రాఫర్, మైక్రో అబ్జర్వర్ సహా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏజెంట్ ఫారం నింపకుండా ఎన్డీసీసీబీ చైర్మన్ అడ్డగింత

చిల్లకూరులో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం

పెళ్లకూరు, మే 12 : మండలంలోని చిల్లకూరు పోలింగ్ కేంద్రం వద్ద ఆదివారం రాత్రి వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. చిల్లకూరు పోలింగ్ కేంద్రంలో టీడీపీ తరుపున పోలింగ్ ఏజెంట్‌ను ఏర్పాటు చేసుకునేందుకు నాయకులు పేరం రమేష్‌నాయుడు, నాగేంద్రప్రసాద్‌రెడ్డి, చైతన్య కృష్ణారెడ్డి చేరుకున్నారు. ఏజెంట్ ఫారాలను నింపుతుండగా పక్క గ్రామాలకు చెందిన వారికి తమ గ్రామంలో పనేమంటూ చిల్లకూరుకు చెందిన ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి వాగ్వాదానికి దిగారు. ఈక్రమంలో నాగేంద్రప్రసాద్‌రెడ్డిపై సత్యనారాయణరెడ్డి దాడి చేశారని టీడీపీ నాయకులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, సీఐ జగన్మోహన్‌రావు, ఎస్‌ఐ శ్రీకాంత్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివాదాన్ని సర్దుబాటు చేశారు. ఏజెంట్ ఫారాలను నింపి సమస్యను సద్దుమణిగించారు.

ఓటుహక్కు వినియోగించుకున్న వారికి ఉచిత ఓపీ


డాక్టర్ మైథిలి

గూడూరు, మే 12: ఈ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకున్న వారి కి తమ ఆసుపత్రిలో మూడు నెలల పాటు ఉచితంగా వైద్యసేవలు అందిస్తామని మైథిలి ఆసుపత్రి వైద్యురాలు మైథిలి చెప్పారు. ఆదివారం స్థానిక ఆసుపత్రి వద్ద ఆమె మాట్లాడుతూ... ఓటు వజ్రా యుధంలాంటిదన్నారు. ప్రజలందరూ వందశాతం ఓటుహక్కును వినియోగించుకుని సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ఓటుహక్కు వినియోగించుకున్నవారికి ఏడాది పాటూ టెలి కన్సల్టెన్సీని ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి మూడు గేదెల బలి

కోట, మే 12 : మండలం చెందోడు సమీపంలో ఉన్న చల్లకాలువ నది వద్ద ఆదివారం విద్యుదాఘాతానికి గురై 3 గెదేలు మృతి చెందాయి. పి.కోటారెడ్డి అనే రైతు తన గెదేలను సమీప పోలాల్లో మేత కోసం తోలాడు. పొలాల సమీపంలో ఉన్న చల్లకాలువలోకి నీళ్లు తాగేందుకు వెళ్లాయి. ఆ నీటిలో కొంత మంది రైతులు విద్యుత్ మోటర్లను ఉంచగా గెదేలు నీళ్లతాగుతున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి.

టీడీపీ నాయకుడి కారు దహనం

నాయుడుపేట టౌన్, మే 12 : పట్టణ పరిధిలోని జువ్వలపాళెంలో టీడీపీ నాయకుడు గాడి తిలక్‌బాబు కారును గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. బాధితుడి కథనం మేరకు... ఇటీవల కాంగ్రెస్ నుంచి టీడీపీలో చేరారు. ఈ క్రమంలో శనివారం రాత్రి తన కారును జువ్వలపాళెంలో ఇంటి ముందర పెట్టాడు. అర్ధరాత్రి మంటలు చెలరేగి శబ్దం రావడంతో లేచి చూశాడు. హుటాహుటిన చుట్టుపక్కల వారి సాయంతో మంటలపై నీరు పోలీ అదుపుచేశారు. వైసీపీ మూకలే తనకారును దహనం చేసి వుంటాయని చేసినట్లు చెబుతున్నాడు. దళితుడైన తనను ఇబ్బంది పెట్టడం వైసీపీకి మంచి పద్ధతి కాదన్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డికి ఫిర్యాదు చేశాడు.

రక్షణ కల్పించండి

ఆర్వోకు చిల్లకూరు టీడీపీ నాయకుల వినతి

సూళ్లూరుపేట, మే 12: పెళ్లకూరు మండలం చిల్లకూరులో ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఈసీ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చిల్లకూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆర్వోకు వినితి చేశారు. తమ గ్రామంలో ఏజెంట్లుగా ఉండకుండా వైసీపీ నాయకులు బెదిరిస్తున్నారని సన్నారెడ్డి వేణుగోపాల్ రెడ్డి, పి.రాజగోపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి ఆదివారం ఆర్వో చంద్రమునికి వినతిపత్రం అందజేశారు. ఏజెంట్లుగా కూర్చుంటే దాడి చేస్తామని వైసీపీ నాయకులు తమ ఇళ్లకు వచ్చి బెదిరిస్తున్నారని తమకు రక్షణ కల్పించాలని కోరారు. జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్, ఎస్పీకి కూడా వినతిపత్రం అందించినట్టు తెలిపారు.

గూడూరు (అసెంబ్లీ)



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్
పాశం సునీల్‌కుమార్	మేరిగ మురళీధర్	యు.రామకృష్ణారావు

స్వతంత్రులు: 6 మొత్తం : 14

సూళ్లూరుపేట (అసెంబ్లీ)



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్
నెలవల విజయశ్రీ	కిలివేటి సంజీవయ్య	చందనమూడి శివ

స్వతంత్రులు: 3 మొత్తం : 9

వెంకటగిరి (అసెంబ్లీ)



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్
కురుగొండ్ల రామకృష్ణ	రాంకుమార్‌రెడ్డి	పి.శ్రీనివాసులురెడ్డి

స్వతంత్రులు: 2 మొత్తం : 10

తిరుపతి (ఎంపీ)



బీజేపీ	వైసీపీ	కాంగ్రెస్
వెలగపల్లి వరప్రసాదరావు	మద్దిల గురుమూర్తి	చింతా మోహన్

స్వతంత్రులు: 8 మొత్తం : 23